ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
CELEBRATING 11TH YEAR ANNIVERSARY
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 88 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | గురువారం 4 డిసెంబర్ 2025 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 88 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | THU 4 DECEMBER 2025 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## వ్యవసాయ రంగం బలోపేతానికి పంచసూత్రాలు..

# గత పాలనను సరిదిద్దుతాం



- 'రైతన్నా.. మీ కోసం' సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు ఉండవని వెల్లడి
- ఏపీ వ్యవసాయ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతు ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం 'పంచసూత్రాల'ను అమలు చేస్తున్నామని, ప్రతి రైతు వీటిని ఆచరించి లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. 'రైతన్నా... మీ కోసం' సభలో ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు.

గత ఐదేళ్లలో జరిగిన భూ అవకతవకలను, ల్యాండ్ గోల్మాల్‌ను సరిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించానని చంద్రబాబు తెలిపారు. తమకు నచ్చిన భూములు ఇవ్వని వారిని 22-ఏ జాబితాలో పెట్టి వేధించారని, వాటన్నింటినీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని హామీ ఇచ్చారు. నాటి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని, పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి కూటమి ఏర్పడిందని గుర్తుచేశారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, దీపం-2.0 కింద మూడు ఉచిత సిలిండర్లు వంటి పథకాలను వివరించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లపై ఒక్క గుంత కూడా లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు.వ్యవసాయమే రాష్ట్రానికి బలమని, పోలవరం పూర్తిచేసి, నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరందిస్తామని చెప్పారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చుకోవాలని, అంతర పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఏపీ వ్యవసాయ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## అభివృద్ధిలో జనసేన శ్రేణులు

# భాగం కావాలి

- జన సైనికులకు కీలక సూచనలు చేసిన పవన్ కల్యాణ్
- గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు కమిటీల ఏర్పాటు
- ప్రతి కమిటీలో మహిళలకు తప్పనిసరిగా ప్రాధాన్యత ఉండాలన్న పవన్
- అంతర్గత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఉండాలని సూచన



పెన్ పవర్ డెస్క్:జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పార్టీ నిర్మాణంపైనా, భవిష్యత్ కార్యాచరణపైనా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు స్థానిక అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు.

వివరాలు 2లో..

## ప్రభుత్వ వైఫల్యమే చెన్నై ముంపునకు కారణం

### డీఎంకే సర్కార్‌పై విజయ్ ఫైర్



- చెన్నై వరదలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న విజయ్
- నాలుగున్నరేళ్లుగా డ్రైనేజీ పనులు పూర్తి చేయలేదని విమర్శ
- వరద బాధితులకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్

వివరాలు 2లో..

## పర్వతాల విషయంలో కేంద్రం కొత్త మార్పులు..

### సోనియా గాంధీ తీవ్ర ఆగ్రహం



- 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుకూలంగా కేంద్రం మార్పులు
- ఆరావళి భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంట్ అని హెచ్చరిక
- అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే సహజ సంపద తరిగిపోతోందని ఆవేదన

పెన్ పవర్ డెస్క్:ఆరావళి పర్వత శ్రేణికి సంబంధించి కేంద్ర పర్యాటక శాఖ నూతన మార్పులు తీసుకువచ్చిం ది. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొం డల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకు నేందుకు అనుమతిస్తూ ఆరావళి పర్వతాల విషయంలో సవరణలు చేసింది. దీనిపై ఏఐసీసీ అగ్రనాయకురాలు

వివరాలు 2లో..

## భారత్‌తో యుద్ధానికి ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఉవ్విళ్లూరుతున్నారు

### ఇమ్రాన్ ఖాన్ సోదరి



- ఇమ్రాన్ ఖాన్ మాత్రం భారత్‌తో స్నేహం కోరుకుంటున్నారని ఆయన సోదరి వివరణ
- ఆసిమ్ మునీర్ ఒక ఛాందసవాద ఇస్లామిస్ట్ అంటూ అలీమా ఖాన్ వ్యాఖ్య
- జైల్లో ఇమ్రాన్‌ను మానసికంగా హింసిస్తున్నారని కుటుంబ సభ్యుల ఆందోళన


పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఆసిమ్ మునీర్ భారత్‌తో యుద్ధం చేయాలని తహతహలాడుతుంటే, తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్ మాత్రం పొరుగు దేశంతో స్నేహాన్ని కోరుకుంటారని ఆమె అన్నారు. 'స్కై న్యూస్' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు."ఆసిమ్ మునీర్ ఛాందసవాద ఇస్లామిస్ట్. అందుకే ఇస్లాంను విశ్వసించని వారితో

వివరాలు 2లో..

## డిప్యూటీ సీఎం పదవికి పవన్ అనర్హుడు..

# కేబినెట్ నుంచి తొలగించాలి

- పవన్ వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయన్న నారాయణ
- రాజకీయాలు వదిలి సనాతన ధర్మం చూసుకోవాలని హితవు
- దిష్టి వంటి మాటలు మాట్లాడేవారికి రాజకీయాల్లో స్థానం లేదని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పదవికి అనర్హుడని, ఆయన్ను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కోనసీమ జిల్లా పర్యటనలో పవన్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల

వివరాలు 2లో..

# ఆటోలో మృతదేహాలు..

### హైదరాబాద్ పాతబస్తీలో కలకలం

- ఘటనా స్థలంలో మూడు సిరంజీల లభ్యం
- డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగానే మరణించారని అనుమానాలు
- మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం తరలించి పోలీసుల దర్యాప్తు



పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్‌లోని పాతబస్తీలో కలకలం చోటుచేసుకుంది. బుధ వారం ఉదయం చాంద్రాయణ గుట్టలోని ఫ్లైఓవర్ కింద నిలిపి ఉంచిన ఆటోలో ఇద్దరు యువ కులు విగతజీవులుగా కనిపించ డంతో, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు

వివరాలు 2లో..

## 80 వేల మంది చూస్తుండగా.. 13 ఏళ్ల బాలుడితో హంతకుడికి మరణశిక్ష!



- ఆఫ్ఘనిస్థాన్‌లో 13 మందిని చంపిన హంతకుడికి బహిరంగ మరణశిక్ష
- కోస్త్ ప్రావిన్స్‌లోని స్టేడియంలో 80 వేల మంది చూస్తుండగా శిక్ష అమలు
- మృతుల కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలుడితో శిక్షను అమలు చేయించిన తాలిబన్లు
- తాలిబన్ల చర్యను అమానవీయమంటూ తీవ్రంగా ఖండించిన ఐక్యరాజ్యసమితి

పెన్ పవర్ డెస్క్:ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల పాలనలో అనాగరిక, ఆటవిక న్యాయం మరోసారి బయటపడింది. ఒకే కుటుంబంలో 13 మందిని దారుణంగా హత్య చేసిన వ్యక్తికి, మృతుల కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలుడి చేత

వివరాలు 2లో..

# ఉప ముఖ్యమంత్రి గారూ, మీకు ఇది సబబు కాదు

### పవన్ కల్యాణ్ 'తెలంగాణ' వ్యాఖ్యలపై షర్మిల

- అన్నదమ్ముల్లా ఉంటున్న రాష్ట్రాల మధ్య వైషమ్యాలు సరికాదన్న షర్మిల
- తెలంగాణ వారి దిష్టి తగిలిందనడం బాధాకరమని వ్యాఖ్య
- కొబ్బరి పంటకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టక దిష్టి మీదకు తోసేయడం ఏమిటని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ నాయకుల దిష్టి తగలడం వల్లనే కోనసీమలో కొబ్బరితోటలు ఎండిపోయాయన్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అన్నదమ్ముల్లా ఉంటున్న రెండు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం ఉప ముఖ్యమంత్రిగా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డిజిటల్ బుక్-కోటి సంతకాలు.. వైసీపీ సాధించిందేంటి ..!

ఏపీలో 11 స్థానాలకు పరిమితమైన వైసీపీ.. ఏదో ఒకరకంగా తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ అధినేత జగన్ తరచుగా ఏదో ఓ కార్యక్రమానికి పిలుపునిస్తున్నారు. అయితే.. అవి ఏమేరకు సక్సెస్ అవుతున్నాయన్నది మాత్రం పెద్దగా స్క్రూటినీ చేయడం లేదు. దీంతో పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాల విషయంలో ప్రజల ఆలోచన ఎలా ఉంది? వారు ఎలా ఫీలవుతు న్నారు? అనేది కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో చేపడుతున్న కార్యక్రమాలు చరిత్రలో కలుస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. తాజాగా రెండు కీలక విషయాలను తెరమీదికి వచ్చారు. 1) డిజిటల్ బుక్: పార్టీప రంగా కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి వేధింపులు ఎదురైనా.. పోలీసుల నుంచి ఎలాంటి కేసులు పెట్టినా.. వెంటనే డిజిటల్ బుక్‌లో నమోదు చేయించేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై జగన్ పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశారు. కానీ, తొలి రెండు మూడురోజుల్లోనే.. పెద్ద ఎత్తున వైసీపీ హయాంలో జరిగిన అక్రమలపైనే ఫిర్యాదులు వచ్చాయి. విడదల రజినీ మంత్రిగా ఉన్నప్పుడు తన ఇల్లు పగలగొట్టించారని.. తన కారును ధ్వంసం చేయించారని ఒకరు.. నాటి వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై మరో నలుగురు ఇలా ఆధారాలతో సహా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేసుకున్నారు. దీంతో అసలు కంటే కొసరు ఎక్కువ కావడంతో ఈ డిజిటల్ బుక్ ప్రస్తు తం ఏమైందో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం దీనిలో ఫిర్యాదు చేసుకునే నాయకులు కూడా పెద్దగా కనిపించడం లేదు.

ఇక, మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ.. చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమం కూడా వాయిదా పడినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రెండు సార్లు దీనిని వాయిదా వేశారు. ఇప్పుడు మూడోసారి కూడా వాయిదా పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి కారణం.. పెద్దగా సంతకాల సేకరణ జరగలేదు. వాస్తవానికి ఇది వైసీపీకి అత్యంత కీలకమైన కార్యక్రమం. అయినప్పటికీ.. నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమైన కారణంగానే దీనికి పెద్దగా ఊపు రాలేకపోయిందన్న చర్చ ఉంది. మొత్తంగా డిజిటల్ బుక్-కోటి సంతకాలు.. వైసీపీ సాధించిందేంటి? అనే ప్రశ్న తెరమీదికి వచ్చినప్పుడు ప్రచారం తప్ప మరొకటి లేదన్న సమాధానమే వినిపిస్తుండడం గమనార్హం.

# 80 వేల మంది చూస్తుండగా.. 13 ఏళ్ల బాలుడితో హంతకుడికి మరణశిక్ష!

- మొదటి పేజి తరువాయి

మరణశిక్షను అమలు చేయించారు. కోస్ట్ ప్రావిన్స్‌లోని ఓ క్రీడా మైదానంలో సుమారు 80,000 మంది ప్రేక్షకుల సమక్షంలో ఈ బహిరంగ శిక్షను అమలు చేయడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీసింది.

**అసలేం జరిగిందంటే..!**

మంగళ్ అనే వ్యక్తి సుమారు 10 నెలల క్రితం అబ్దుల్ రెహమాన్‌తో పాటు అతని కుటుంబంలోని 13 మందిని, అందులో తొమ్మిది మంది పిల్లలను హత్య చేశాడు. ఈ కేసులో దోషిగా తేలిన మంగళ్‌కు తాలిబన్ల సుప్రీంకోర్టు "కిసాస్" (ప్రతీకారం) చట్టం కింద మరణశిక్ష విధించింది. ఈ శిక్షను అమలు చేసేందుకు అధికారులు ప్రజలను బహిరంగంగా ఆహ్వానించారు. శిక్ష అమలుకు ముందు, దోషిని క్షమించే అవకాశం ఉందా? అని ఆ 13 ఏళ్ల బాలుడిని అడిగారు. అయితే, అందుకు ఆ బాలుడు నిరాకరించడంతో అతని చేతికే తుపాకీ ఇచ్చి దోషిని కాల్చి చంపమని ఆదేశించారు. 2021లో తాలిబన్లు అధికారం చేపట్టిన తర్వాత ఇలా న్యాయవ్యవస్థ ద్వారా మరణశిక్ష అమలు చేయడం ఇది 11వ సారి. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా స్పందించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధి రిచర్డ్ బెన్నెట్ ఈ చర్యను "అమానవీయమైన, క్రూరమైన శిక్ష" అని అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇలాంటి వాటిని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తాలిబన్లు షరియా చట్టం పేరుతో బహిరంగ ఉరిశిక్షలు, కొరడా దెబ్బలు వంటి కఠిన శిక్షలను తిరిగి ప్రవేశపెట్టడంపై మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రభుత్వ వైఫల్యమే చెన్నై ముంపునకు కారణం

తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్, చెన్నైతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన జలమయానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. డీఎంకే ప్రభుత్వం నాలుగన్నరేళ్లుగా డ్రైనేజీ పనులను అసంపూర్తిగా, అసమర్థంగా చేపట్టడమే ప్రస్తుత దుస్థితికి కారణమని ఆయన తీవ్రంగా విమర్శించారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "చెన్నైతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల సామాన్య ప్రజల జీవితాలు అతలాకుతలమయ్యాయి. ఈ కష్టాలకు అసలు కారణం.. ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా, పూర్తిగా నిర్మించకపోవడమే. ప్రజలపై ప్రభుత్వానికి కొంచెం శ్రద్ధ ఉన్నా, కొద్దిరోజుల వర్షానికే నగరం ఇలా నీట మునిగేది కాదు" అని విజయ్ పేర్కొన్నారు. వర్షపు నీటి కాలువల ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించినప్పటికీ, ప్రభుత్వం ఫలితాలు

చూపడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలందరూ సురక్షితంగా, జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేసిన విజయ్, వరద బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని తన పార్టీ కార్యకర్తలను కోరారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అల్పపీడనం కారణంగా తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీనివల్ల అనేక ప్రాంతాలు జలమయమై, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

# అభివృద్ధిలో జనసేన శ్రేణులు భాగం కావాలి

- మొదటి పేజి తరువాయి

ఈ లక్ష్య సాధన కోసం గ్రామ స్థాయి నుంచి పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పవన్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించాలని, వారు స్థానిక అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ఇదే తరహాలో మండల, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో ఇప్పటికే ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, దాని పనితీరును సమీక్షించి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని వివరించారు. పార్టీ కమిటీల నియామకంలో మహిళలకు తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ స్పష్టం చేశారు. ఐదుగురు సభ్యుల కమిటీలో కనీసం ఒకరు, గరిష్ఠంగా ఇద్దరు వీర మహిళలు ఉండాలని, 11 మంది సభ్యుల కమిటీలో ముగ్గురికి స్థానం కల్పించాలని నిర్ణయించారు. పార్టీలో అంతర్గత వివాదాల పరిష్కారం కోసం కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో 11 మంది సభ్యులతో 'కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్' విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భర్తీ అయిన నామినేటెడ్ పదవుల వివరాలను సమీక్షించిన పవన్, మిగిలిన పదవుల భర్తీలో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని సూచించారు.

# పర్వతాల విషయంలో కేంద్రం కొత్త మార్పులు..

- మొదటి పేజి తరువాయి

సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంట్ లాంటివని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థకు రాసిన కథనంలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలోని కొన్ని అంశాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలకు దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక స్థానం ఉందని ఆమె అన్నారు. అక్రమ మైనింగ్ కారణంగా ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చిందని అన్నారు.

100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించడం మైనింగ్ మాఫియాకు బహిరంగ ఆహ్వానం పలుకడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ఇది వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఆటోలో మృతదేహాలు..

## హైదరాబాద్ పాతబస్తీలో కలకలం

- మొదటి పేజి తరువాయి

అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)లుగా గుర్తించారు. డ్రగ్ ఓవర్ డోస్ కారణంగానే యువకులు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఘటనాస్థలంలో మూడు సిరంజీలను క్లూస్ టీమ్ గుర్తించింది. దీంతో ముగ్గురు యువకులు డ్రగ్స్ తీసుకున్నట్లు తెలుస్తోందని, చనిపోయిన యువకులతో కలిసి డ్రగ్స్ తీసుకున్న మూడో వ్యక్తి ఎవరనేది గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని, యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రి గారూ, మీకు ఇది సబబు కాదు

- మొదటి పేజి తరువాయి

మీకు సబబు కాదని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "కోనసీమ కొబ్బరికి తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడటం బాధాకరం. ఇలాంటి మాటలు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టడమే. ఇది పవన్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య మళ్ళీ ప్రాంతీయ విద్వేషాలను నింపొద్దు" అని ఆమె పేర్కొన్నారు. శంకరగుప్తం డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు, డ్రెడ్జింగ్ నిర్మాణాలకు పట్టింపు లేకపోతే, సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో లక్షల సంఖ్యలో చెట్లు కూలిపోయాయని, దీనికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదని ఆమె ఆరోపించారు. దీనిని దిష్టి మీద రుద్దడం సరికాదని అన్నారు. "మూఢ నమ్మకాలను అడ్డంపెట్టుకుని ప్రజలను కించపరచడం ఉప ముఖ్యమంత్రిగా మీకు సబబు కాదు. కోనసీమ కొబ్బరిచెట్టుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉప్పునీటి ముప్పును తప్పించండి. కొబ్బరి రైతుల కష్టాలకు తక్షణ పరిష్కారం చూపండి. రూ.3,500 కోట్లు వెంటనే కేటాయించి పనులు మొదలు పెట్టండి" అని ఆమె పేర్కొన్నారు.

# డిప్యూటీ సీఎం పదవికి పవన్ అనర్హుడు..

# కేబినెట్ నుంచి తొలగించాలి

- మొదటి పేజి తరువాయి

మధ్య చిచ్చు పెట్టేలా, ప్రజల ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. తెలుగు రాష్ట్రాలు భౌగోళికంగా విడిపోయినప్పటికీ, ప్రజల మధ్య సత్సంబంధాలు ఉన్నాయని నారాయణ గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమార్తెను ఏపీలోని భీమవరానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పవన్ వ్యాఖ్యలు ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. పవన్ కల్యాణ్ రాజకీయ వైఖరిపైనా నారాయణ విమర్శలు చేశారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో చేగువేరా తనకు ఆదర్శమని చెప్పిన పవన్, ఇప్పుడు సావర్కర్‌ను భుజానకెత్తుకుని 'సనాతన ధర్మం' అంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు నిజంగా సనాతన ధర్మంపై ఆసక్తి ఉంటే, రాజకీయాలు వదిలిపెట్టి ఆ మార్గంలో వెళ్లవచ్చని సూచించారు. 'దిష్టి తగిలింది' వంటి మాటలు మాట్లాడే సనాతనవాదులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని నారాయణ వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలకు తగరని, ఆయన్ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భారత్‌తో యుద్ధానికి ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ఉవ్విళ్లూరుతున్నారు

- మొదటి పేజి తరువాయి

యుద్ధం చేయాలని ఆయన కోరుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి భారత్‌తో, చివరికి బీజేపీతో కూడా స్నేహం చేయడానికి ప్రయత్నిస్తారు. కానీ, మునీర్ లాంటి వ్యక్తి ఉన్నప్పుడు భారత్‌తో యుద్ధం తప్పదు" అని అలీమా స్పష్టం చేశారు. ఈ ఏడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు, ఆయన భార్య బుష్రా బీబీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు అప్పటి ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న మునీర్ ఆసక్తి చూపారు. దీంతో ఆగ్రహించిన ఇమ్రాన్, మునీర్‌ను ఎనిమిది నెలల్లోనే ఆ పదవి నుంచి తొలగించారు. అప్పటి నుంచి వారి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి రావల్పిండిలోని అదియాలా జైల్లో ఉన్నారు. ఇటీవల ఆయన మరో సోదరి డాక్టర్ ఉజ్మా ఖాన్ జైల్లో కలిసి, తన సోదరుడిని మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు. తన దుస్థితికి ఆసిమ్ మునీరే కారణమని ఇమ్రాన్ చెప్పినట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వం భయంతోనే ఇమ్రాన్‌ను ఏకాకిని చేసి, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని అలీమా విమర్శించారు. తన సోదరుడి విడుదలకు పశ్చిమ దేశాలు చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# 2025లో ఇంటర్నెట్‌ను షేక్ చేసిన వైరల్ వంటకాలు ఇవే!

- 2025లో సోషల్ మీడియాను ఊపిన వైరల్ ఫుడ్ రెసిపీలు
- కంగారూ బిర్యానీ, చీటోస్ చికెన్ వంటి వినూత్న ప్రయోగాలు
- ఆరోగ్యకరమైన సొరకాయ మోమో, కిచిడీ పరాఠాలకు మంచి ఆదరణ
- సాధారణ వంటకాలకు కొత్త టచ్ ఇచ్చిన అప్పడం ఆమ్లెట్
- ఆవిరిపై ఉడికించిన గుడ్ల కర్రీకి ఫుడ్ లవర్స్ ఫిదా



సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుంటే కొన్ని ఫుడ్ వీడియోలు మనల్ని క్షణంపాటు ఆపేస్తాయి. కొత్తగా ఏదైనా ప్రయత్నించాలనే ఆసక్తిని రేకెత్తిస్తాయి. 2025 సంవత్సరం కూడా అలాంటి ఎన్నో వినూత్న వంటకాలకు వేదికైంది. రోజూ తినే పదార్థాలకు కొత్త హంగులు అద్దడం నుంచి ఎవరూ ఊహించని ప్రయోగాలు చేయడం వరకు, ఈ ఏడాది ఎన్నో రెసిపీలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న ఈ తరుణంలో, ఇంటర్నెట్‌ను షేక్ చేసిన కొన్ని ట్రెండింగ్ వంటకాలను ఓసారి గుర్తుచేసుకుందాం. 1. గుడ్లతో స్పైసీ మయో: ఉడికించిన గుడ్డు, ఎండు మిరపకాయలు, వెల్లుల్లి, కొద్దిగా నూనె కలిపి గ్రైండ్ చేసి స్పైసీ మయో తయారుచేయడం ఈ రెసిపీ ప్రత్యేకత. దీన్ని వేడి వేడి రోటీపై రాసి, టమాటా, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలతో రోల్ చేసి తినే విధానం చాలామందిని ఆకర్షించింది.

2. కంగారూ బిర్యానీ: చికెన్, మటన్ బిర్యానీలు సర్వసాధారణం. కానీ కంగారూ మాంసంతో దక్షిణాది మసాలాలు దట్టించి చేసిన బిర్యానీ ఈ ఏడాది ఓ సంచలనం. ఈ వెరైటీ ప్రయోగం ఫుడ్ లవర్స్‌లో తీవ్రమైన క్యూరియాసిటీని పెంచింది.

3. చీటోస్ చికెన్ లాలీపాప్: మసాలాలు పట్టించి గ్రిల్ చేసిన చికెన్‌ను తురిమి, చీజ్, పెరుగుతో కలిపి మళ్లీ ఎముకలకు చుట్టారు. ఆ తర్వాత గుడ్డులో ముంచి, స్పైసీ చీటోస్ పౌడర్‌తో కోటింగ్ ఇచ్చి నూనెలో డీప్ ఫ్రై చేశారు. ఈ కరకరలాడే స్నాక్ వీడియో తెగ వైరల్ అయింది.

4. ఆరోగ్యకరమైన సొరకాయ మోమో: సొరకాయ తురుము, పనీర్‌తో ఫిల్లింగ్ చేసి, ఆవిరిపై ఉడికించిన ఈ హెల్తీ మోమోలు డైట్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

5. క్రిస్పీ అప్పడం ఆమ్లెట్: అప్పడాన్ని కేవలం సైడ్ డిష్‌గానే కాకుండా, దానిపైనే ఆమ్లెట్ వేసి సరికొత్త స్నాక్ తయారుచేశారు. అప్పడంపై గుడ్డు సొన, ఉల్లిపాయలు, టమాటాలు, చీజ్ వేసి టాకోలా మడిచి తినే ఈ రెసిపీ చాలా సింపుల్‌గా, టేస్టీగా ఉండటంతో వైరల్ అయింది.

6. కిచిడీ పరాఠా: మిగిలిపోయిన కూరలతో పరాఠాలు చేయడం మనకు తెలుసు. కానీ, మిగిలిపోయిన కిచిడీని చపాతీ పిండిలో స్టఫ్ చేసి, వెన్నతో కాల్చి చేసిన పరాఠా ఓ కొత్త ఆలోచన. ఆహారాన్ని వ ృథా చేయకుండా రుచికరంగా మార్చే ఈ విధానం అందరికీ నచ్చింది.

7. బ్రెడ్, చికెన్ నగ్గెట్స్: ఇంట్లోనే సులభంగా చికెన్ నగ్గెట్స్ తయారుచేసే విధానం ఇది. సగం ఉడికించిన చికెన్‌కు గుడ్డు, బ్రెడ్ క్రమ్స్ పట్టించి, తక్కువ నూనెతో ఫ్రై చేశారు. వీటిని ఫ్రీజర్‌లో నిల్వ చేసుకునే సౌలభ్యం కూడా ఉండటంతో చాలామంది దీన్ని ప్రయత్నించారు.

8. ఆవిరి గుడ్ల మసాలా కర్రీ: గుడ్డు మిశ్రమాన్ని ఇడ్లీ ప్లేట్లలో వేసి ఆవిరిపై ఉడికించి, వాటిని ముక్కలుగా కట్ చేశారు. ఆ తర్వాత ఉల్లిపాయ, టమాటాలతో చేసిన మసాలా గ్రేవీలో ఈ ఉడికించిన గుడ్డు ముక్కలను వేసి వండారు. ఈ వినూత్నమైన ఎగ్ కర్రీ రెసిపీ ఎంతో మంది ప్రశంసలు పొందింది.

# చాయ్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 3**

పట్టణంలోని పామూరు రోడ్ లో నూతనంగా ఏర్పాటుచేసిన చాయ్ బంక్ ను బుధవారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి నిర్వాహకులు రాంబాబు, రమేష్ లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు ప్రారంభించిన ఈ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పెన్ పవర్ ప్రకాశం

## ఎపిసోడ్-1

# అడవిలో దొంగలు పడ్డారు!

# నిలువునా నరికేసి తరలించారు



- తరలింపుకు సిద్ధం చేసిన జామాయిల్
- పచ్చని అడవి పై గొడ్డలి పెట్టు
- వాహనాల్లో వందల టన్నుల కర్ర తరలింపు
- అటవీశాఖ సిబ్బందిపై ఆరోపణలు
- ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్న ప్రజలు





**పీసీ పల్లి, పెన్ పవర్ డిసెంబర్ 3**

మండలంలోని లక్ష్మక్కపల్లి పంచాయతీ పరిధిలోని అడవిలోపల్లి అడవిలో అక్రమార్కులు పుష్ప సినిమాను గుర్తు చేస్తున్నారు. కంటికి కన్పించిన మేర భారీ చెట్లు నరికి గుట్టు చప్పుడు కాకుండా తరలించేశారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందల టన్నుల కు పైగానే చెట్లను నరికి నేలకూల్చి మాయం చేశారు. కొన్ని నెలల పాటు చెట్లను నరుకుతుంటే క్షేత్రస్థాయి అటవీశాఖ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనిగిరి అటవీ రేంజ్ పరిధిలో పరిసర అటవీ ప్రాంతంలోని భారీ చెట్లు మాయం అయ్యి వాటి మొదలు మాత్రమే సాక్ష్యాలుగా నిలిచాయి. అడవిలో పల్లి నడ్డోడు ప్లాట్ లో దాదాపు 150 జామాయిల్ చెట్లకు పైగానే నరికి వేతకు గురయ్యాయి. అంతేకాకుండా పొగాకు ను బ్యార్న్‌లో కాల్చేందుకు వేల టన్నుల్లో చెట్లను నరికి కొందరు అక్రమంగా తరించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ నరికేసి నా ఒక్కో చెట్టు వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉంటుందని 50 ఏళ్ల వయస్సు దాటిన చెట్లు కూడా ఉన్నట్టు చెబుతున్నారు. 25 అడుగుల పైగా ఎత్తు పెరిగిన భారీ వృక్షాలను నరికి ఎలా తరలించారని ఆశ్చర్యపోతున్నారు. ఇటువంటి ఒక చెట్టును నరికితే అటవీ ఘాట్ రోడ్డుపై ట్రాక్టర్‌పై రవాణా చేయాల్సిందే. అటువంటిది ఇంత జరుగుతున్నా అటవీ శాఖ సిబ్బందికి తెలియకుండా తరలించడం అసాధ్యమన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. చెట్లు నరికిన అటవీ ప్రాంతం నుంచి ప్రధాన రహదారి పై వలేటివారిపాలెం మండలంలోని వే బ్రిడ్జి దగ్గర కాటా పెట్టి మరి పలు ప్రాంతాలకు తరలించినట్టు భావిస్తున్నారు.

**విలువైన వృక్షసంపద మాయం**

నరికి వేతకు గురైన ప్రాంతంలో అరుదైన వృక్షాలు నేలమట్టం అయ్యినట్టు చెబుతున్నారు. సిరిమేణు, మద్ది, ఏపి, పాలకొయ్య , నల్లబొలుసు, కర్ర వంటి వృక్షాలు నరికి వేతకు గురయ్యాయి. వీటిలో ఎంతో విలువైన ఏపి ,మద్ది చెట్లు ఉన్నాయి. ప్రస్తుతం సిరిమేణు, ఏపి కర్రకు మార్కెట్‌లో మంచి ధర ఉంది. పొగాకు బ్యార్న్‌లో ఈ కర్రతో కాల్చితే రంగు బాగా వస్తుందని చెబుతున్నారు. పాలు చెట్టు తో మంచాలు ఎక్కువ తయారీ చేస్తారు. ఇలా ఎంతో విలువైన వృక్ష సంపదను నరికి వేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరికివేతకు గురైన వాటిలో సుమారు 25 అడుగుల ఎత్తు, 2నుంచి 3 అడుగుల చుట్టుకొలత ఉన్న చెట్లు ఉన్నాయని చెబుతున్నారు. ఈ స్థాయిలో ఉన్న ఒక్కొ చెట్టు కలప రూపంలో మార్కెట్‌లో దాదాపు టన్ను 4 వేల నుంచి 5 వేలు ధర పలుకుతుందని ఈ లెక్కన నరికివేసిన అక్రమార్కులు ఎంత వెనుకేసుకున్నారో అంటూ పలువురు లెక్కలు వేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి కిందకు రావాలంటే ప్రధాన రోడ్డు మాత్రమే ఉంది. మిషనరీలు, భారీ వాహనాల సహాయంతో చెట్లు నరికి తరలించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం అక్కడ చెట్లు మొదలు, కొమ్మలు మాత్రమే సాక్షాలుగా ఉన్నాయి. అటవీశాఖ ఉన్నతాధికారులు ఒక్కొ చెట్టు మొదలు ఆధారంగా ఏ జాతికి చెందింది, దాని వయస్సు ఎంతుంటుంది, ఏ స్థాయిలో కలప వచ్చిందనే దానిపై విచారణ చేపట్టాలి.

**సిబ్బంది ఏం చేస్తున్నారు..?**

చెట్లు నరికివేస్తుంటే అక్కడ బేస్ క్యాంప్ సిబ్బంది, ఫారెస్టు సిబ్బంది ఏం చేస్తున్నారు. ఇదంతా ఒక్క రోజు జరిగింది కాదు. దాదాపు రెండు నెలల నుంచి జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు అసలు అటువైపు ఎందుకు వెళ్లలేదు..? కింది స్థాయి సిబ్బంది రేంజ్ కార్యాలయ అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పచ్చిమ ప్రాంతాన ఎంతో విలువైన అటవీ సంపద ఉంది. ఇక్కడ వృక్ష సంపద అక్రమార్కుల చేతుల్లో పడి తరలిపోతోంది. ఈప్రాంతంపై అటవీశాఖ సిబ్బంది నిఘా ఉన్నట్టా లేనట్ట..? ఎక్కడకక్కడ నైట్ వాచర్స్, గార్డ్‌లు, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు. మాయమైన చెట్లు విషయంలో అటవీశాఖాధికారులు ఊహించని స్థాయిలో ముడుపులు అందడంతో వారు తమ ఉద్యోగ బాధ్యతలను విస్మరించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పొగాకు రైతులు బ్యారన్ నిమిత్తం ఒక ట్రాక్టర్ పుల్లను తరలించే ప్రయత్నం చేస్తే గార్డులు, వాచ్‌మెన్‌లు అడ్డుకోవడం, బతుకు తెరువు కోసం అడవి నుంచి వెదురు, ఇతర పుల్లలను సైకిల్‌పై తరలించే వారిపై అటవీశాఖ సిబ్బంది విరుచుకుపడి కేసులు నమోదు చేయడం, లేదంటే వారి నుంచి మామూళ్లు వసూలు చేయడం వంటివి జరుగుతుంటాయి. అటువంటిది నెలలుగా ఈ స్థాయిలో అడవి నుంచి విలువైన వృక్షాలను తరలిస్తుంటే అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు ఏం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి అడవిని కాపాడాలి**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులకు అడ్డుకట్ట వేసి చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోని అడవులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై

# రైతులు దృష్టి సారించాలి

*మిల్లెట్స్ సాగు కూడా లాభదాయకమే -వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి*

*అధికారుల సూచనలు పాటించండి -చంద్రబాబు అధికారంలో ఉంటే రైతులకు పండుగే*

*రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి*

*కొండముడుసుపాలెంలో రైతులఇళ్లకు వెళ్లి, పథకాలపై ప్రచారం*





**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 3:**

పాతతరం వ్యవసాయ విధానాలను పాటిస్తూనే, కొత్త టెక్నాలజీని ఫాలో అవుతూ వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందవచ్చని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించగా, ఎమ్మెల్యే నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం వారికోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్ర వద్ద జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ ఒకటిన్నర ఏడాదిరి కాలంలో రెండుసార్లు అమలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 6వేలకు, రాష్ట్ర ప్రభుత్వం మరో 14 వేలు కలిపి రైతులు ఖాతాలో జమ చేసిందన్నారు. కొండముడుసుపాలెం గ్రామంలో 563 మంది రైతులకు 38.35 లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి, రైతు కుటుంబాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. రైతుల కోసం ప్రత్యేక పథకాలు, సబ్సిడీ రుణాలు, ఆధునిక యంత్రాలు అందిస్తున్నారని అన్నారు. రైతులు కూడా వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్త టెక్నాలజీపై అవగాహన పెంచుకొని పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరావు సూచించారు. పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా వాడకుండా, ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం రాగులు, సజ్జలు, జొన్నలు లాంటి మిల్లెట్స్ వాడకం బాగా పెరిగింది అన్నారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసే చాలామంది వాటిని వదిలేసి, మిల్లెట్స్ సాగు చేస్తూ నెలకు రెండు మూడు లక్షల సంపాదిస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. రైతుల కూడా మిల్లెట్స్ సాగుపై దృష్టి పెట్టాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని సూచించారు. అలాగే సంవత్సరాల తరబడి పొలంలో ఒకే పంటను వేయకుండా, పంట మార్పిడి పద్ధతిని పాటిస్తే బాగుంటుందన్నారు. అనంతరం అధికారులతో రైతులకు సరిపడా ఎరువులు ఉంచుకోవాలని సూచించారు. రైతులకు ఎరువులు, పశువుల మేతను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డిడిఏ సుధాకర్ రాజు, ఏడిఏ చంద్రమౌళి, అగ్రికల్చర్ ఏడి కేవీ శేషారెడ్డి, కందుకూరు మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ రహీం, హార్టికల్చర్ ఏవో జ్యోతి, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్తారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ తుమ్మ కోటేశ్వరమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలా రంగారావు, పార్టీ నాయకులు పొడపాటి మహేష్, గొంది నర్సింగరావు, అల్లం వెంకటేశ్వర్లు, మాదాల రవికుమార్, సోమినేని కొండలరావు, గ్రామ పార్టీ నాయకులు అనుబంధ సంఘాల సభ్యులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హాస్టల్ల నిర్వహణ ఇలాగేనా?

– హాస్టల్ల నిర్వహణలో లోపాలపై కలెక్టర్ రాజాబాబు ఆగ్రహం



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 03**



హాస్టల్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎంత మాత్రమూ సహించబోనని కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. హాస్టల్లలోని పరిస్థితులను పర్యవేక్షించ డంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్లపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మద్దిపాడులోని బీసీ, ఎస్సీ బాలుర హాస్టల్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా ప్రాంగణాలు మొత్తం కలియతిరిగి తరగతి గదులను, టాయిలెట్లను, ఇతర వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. బీసీ హాస్టల్లో మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేసి వంట సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ చిక్కీలను వారికి సక్రమంగా వార్డెన్ అందజేయకపోవటంపై తీవ్రంగా కోప్పడ్డారు. వార్డెన్ ను తక్షణమే అక్కడి నుంచి బదిలీ చేయాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతిని ఆదేశించారు. విశాలమైన హాస్టల్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఎస్సీ హాస్టల్ లో స్టడీ అవర్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ దిశగా అంచనాలు రూపొందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్ కు చెప్పారు. విద్యార్థులలో ప్రమాణాలు పెంచేందుకు టూటర్లను నియమించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. హాస్టల్ల వార్డెన్లు కూడా బాధ్యతాయతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావించి వారి సమగ్ర ఎదుగుదలకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ రెండు హాస్టల్లలోని విద్యార్థుల సంఖ్య, తాగునీటి సౌకర్యం, వారి ఆరోగ్య స్థితిగతులు, క్రమంగా చేస్తున్న వైద్యపరీక్షలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డీఎంహెచ్వో వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. బాల శంకర రావు, తహసిల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు ఉన్నారు.

# భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్

## ఎంఈఓ నాగకుమార శర్మ -భవితాలో ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 3:**

విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాల్లో బంగారు భవిష్యత్ లభిస్తుందని కందుకూరు ఎంఈఓ ఎం నాగకుమార శర్మ అన్నారు. బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక అభ్యుదయ పాఠశాలలోని భవిత కేంద్రంలో ఐఈఆర్పీ కూనం ఉదయ లక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ శర్మ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరూ ప్రేమతో అక్కున చేర్చుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతులైన వారి విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రశస్త 3.0 యాప్ లో వికలాంగ విద్యార్థుల వివరాలు నమోదు చేయడం ద్వారా వారికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సభాధ్యక్షులు, హెచ్ఎం దివి కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగవైకల్యం శాపం కాదని తెలిపారు. వైకల్యం ఉందని బాధపడకుండా తమ సామర్థ్యాన్ని




వినియోగించు కోగలిగితే దివ్యాంగులు అసాధారణ ప్రజ్ఞావంతులు అవుతారని అన్నారు. ఐఈఆర్పీ ఉదయలక్ష్మీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు మనం అందించే స్నేహహస్తం వారి చీకటి బతుకుల్లో కాంతిరేఖలను విరజిమ్ముతుందని తెలిపారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ప్రతిభావంతులుగా నిలబెడుతుందని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవితా కేంద్రం ద్వారా వైకల్యం కలిగిన విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి, వాటి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం గత ఏడాది 11 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఈ ఏడాది 59 మంది దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల అలవెన్స్ లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉచిత ఫిజియోథెరఫి క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక బహుమతులను ఎంఈఓ శర్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రావణి, ఉపాధ్యాయులు మెర్సీ ఫ్లోరెన్స్, బ్రహ్మయ్య, ఆరిఫ్, నాగకుమారి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఏసుదాసు, సీఆర్పీ రమణారెడ్డి, ఆయా అరుణ కుమారి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులు వైపు మారాలి

### మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 3**

గిద్దలూరు మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో "రైతన్న మీకోసం వర్క్ షాప్" కార్యక్రమం బుధవారం నిర్వహించారు గత వారం లొ ఇంటింటికి వెళ్లి చేసిన కార్యక్రమం లొ రైతులు వద్దకు వెళ్లి తెలుసుకున్న సమస్యలు, వారు అవలంబిస్తున్న సాగు పద్ధతులు తెలుసుకొని వ్యవసాయం లొ రైతులు ఆధునిక పద్ధతులు వైపు మారాలని చూచించారు . ఈ కార్యక్రమం లొ రైతులు ఏ విధంగా నూతన పద్ధతులు అవలంబిస్తే ఆర్థికంగా ముందుకు పురోగతి చెందగలరు అనే వాటి మీద విపులంగా రైతులతో చర్చించి తరువాత వచ్చే 3 సీజన్లలకు సంబందించిన అభివృద్ధి ప్రణాళిక తయారుచేశారు . అనంతరం మన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నల్లజర్ల రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులతో చర్చించి వివిధ సాగు యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో నూతన వరుడిని ఏ విధంగా తేవాలనేది రైతులను ఉద్దేశించి మాట్లాడటం జరిగిందన్నారు దానికి సంబంధించిన లైవ్ ప్రోగ్రాం అన్ని రైతు సేవా కేంద్రాల్లోని ప్రత్యక్ష ప్రసారం రైతులకు చూపించామన్నారు .

# కొమరోలులోని మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ 2 వెంకటరత్నం.

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేసిన ఎంఈఓ



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 3**

కొమరోలు పట్టణంలోని మండల ప్రాథమిక పాఠశాలను బుధవారం కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాలల తనిఖీలో భాగంగా ఆయన బుధవారం కొమరోలు లోని మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు .ఆ సందర్భంగా ఉపాధ్యాయల హాజరు పట్టి, విద్యార్థులు హాజరు పట్టిలను పరిశీలించారు .అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చి విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు స్వీకరించారు. మధ్యాహ్నం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని, విద్యార్థులు అందరూ సక్రమంగా పాఠశాలకు వచ్చే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్ధవంతంగా ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం అమలు చేయాలని, వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆ కార్యక్రమంలో పాఠశాలలు ఉపాధ్యాయులు సి ఆర్ పి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి




**పీసీ పల్లి, పెన్ పవర్ డిసెంబర్ 3**

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎంపీడీఓ జీవి కృష్ణారావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో అభివృద్ధి సంక్షేమ మరియు వివిధ రకాల సర్వేలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ డిసెంబర్ నెలను సురక్షితమైన త్రాగునీరు నెలగా ప్రకటించారని ఇందులో భాగంగా చేపట్టవలసిన చర్యలపై తగు సూచనలు సలహాలు అధికారులకు జారీచేశారు . ఇంటి పన్ను వసూలు మరియు కౌశలం ఎంబీయూ సిటిజన్ ఈకేవైసీ తల్లికి వందనం ఆటో డ్రైవర్ల వారి సేవలో లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకావిష్కరణ

### మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.ఈ.ఓ లు




**గిద్దలూరు పెన్ పవర్ డిసెంబర్ 3**

యూ.టీ.ఎఫ్ కార్యాలయం లో మండల అధ్యక్షులు మొర్రి. పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన 10.వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు ఎన్. అశ్విని కుమార్, పి. నాగభూషణ్ రెడ్డిలు హాజరై ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూ.టీ.ఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన మోడల్ టెస్ట్ పేపర్లు-2026 పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-1 అశ్విని కుమార్ మాట్లాడుతూ మోడల్ టెస్ట్ పేపర్ల పుస్తకం 10.వ తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని, అత్యధిక మార్కులు స్కోర్ చేయడానికి సహకరిస్తుందన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2 నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ప్రభుత్వం నిర్దేశించిన బ్లూ ప్రింట్ ఆధారంగా విషయ నిపుణులు చేత తయారు చేయించారన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ 10.వ తరగతి విద్యార్థులకు సహకరిస్తున్నామన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ ఈ పుస్తకం 10.వ తరగతి విద్యార్థులకు మానసిక ఒత్తిడి తగ్గించి ఉపయుప్తంగా ఉంటుందన్నారు.ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకం స్థానిక యూ.టీ.ఎఫ్ ఆఫీసులో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సుబ్బరాయుడు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, ఉపాధ్యక్షులు ఖాదర్, నాయకులు సంఘ జయ చంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, పోలయ్య, ఆవుల రాజు, రంగారెడ్డి, సగీర్, రంగనాయకులు, హకీం, సలాం,జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# 18వ బ్లాకులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు పూర్తి

### ప్రజల నుండి సేకరించిన సంతకాల పత్రాలను అన్నాకు అందజేసిన గఫూర్



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జీ పెన్ పవర్ డిసెంబర్ 3**

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 18వ బ్లాకులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. బుధవారం ఈ కార్యక్రమాల ద్వారా సేకరించిన 800 సంతకాలతో కూడిన పత్రాలను ఇన్చార్జి అన్నా రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా 18వ బ్లాక్ ఇన్చార్జి సయ్యద్.గఫూర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,నియోజకవర్గం ఇంచార్జ్ అన్నా రాంబాబు ఆధ్వర్యంలో 18వ బ్లాకులో ప్రజా ఉద్యమం, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటి కరణకు వ్యతిరేకంగా 18వ బ్లాక్ లో విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి సేకరణ చేసిన సుమారు 800 సంతకాల పత్రాలను నియోజకవర్గ ఇన్చార్జ్ అన్నా రాంబాబు, పట్టణ అధ్యక్షులు షేక్ సలీం లకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యాక్రమం లో 18వ బ్లాక్ అధ్యక్షుడు మండ్ల శీను , టౌన్ జనరల్ సెక్రెటరీ గోలమారి సత్యం రెడ్డి,వార్డు యూత్ అధ్యక్షుడు అర్షద్ అల్లి, గుంటక అంజి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రహమతుల్లా,ఇమాంస, సద్దాం,సమద్,రసూల్,కమర్, మండ్ల నరసింహ,వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన జేసీ అగ్రహారం సర్పంచ్..

### కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం..

### మార్కాపురం జిల్లా ఏర్పాటు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అయ్యిందన్న జేసీ అగ్రహారం సర్పంచ్...

**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 3**

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని జేసీ అగ్రహారం సర్పంచ్ పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో బెస్తవారిపేట మండలం, జేసీ అగ్రహారం టీడీపీ నాయకులు పాపిజెన్ని చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక వైసీపీ సర్పంచ్ మేకల రమణయ్య వారి అనుచరులు వైసీపీని వీడి, తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వారికీ టీడీపీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తుందని, అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం జేసీ అగ్రహారం సర్పంచ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించటం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమయ్యిందని, మార్కాపురం జిల్లా ఏర్పాటుతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పునాది పడిందన్నారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి చేయాలంటే ఒక్క రుపాయి కూడా నిధులు లేవని, కానీ నేడు గిద్దలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే




అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పంచాయతీలో కూటమి ప్రభుత్వ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ నుండి టీడీపీలో చేరిన వారిలో తోట వెంకట రంగారెడ్డి, పాపిజెన్ని చెన్నారెడ్డి, కేతిరెడ్డి, కొండేపోగు సుధాకర్, కత్తి దావీదు, కత్తి తిమోతి తదితరులు ఉన్నారు.

# నీటి సరఫరా ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్



**కొమరోలు పెన్ పవర్ డిసెంబర్ 3**

కొమరోలు లోని పలు వీధులలో గల నీటి సరఫరా ట్యాంకులను బుధవారం కొమరోలు ఎంపీడీవో సానికొమ్ము సత్యం ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులు శుభ్రపరచి క్లోరినేషన్ చేశారు. డిసెంబర్ మాసాన్ని జిల్లా కలెక్టర్ సురక్షిత నీటి సరఫరా మాసంగా ప్రకటించారు. జిల్లా కలెక్టర్ నుంచి అందిన ఆదేశాల మేరకు కొమరోలు ఎంపీడీవో సానికొమ్ము సత్యం ఆధ్వర్యంలో కొమరోలు గ్రామ సచివాలయాల కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికులతో కొమరోలు పట్టణంలోని వీధులలో పర్యటించి శుభ్రపరచారు. అనంతరం ట్యాంకులను నీటితో నింపి క్లోరినేషన్ చేసి నీటిని పరీక్షించారు. ట్యాంకుల పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. ప్రజలు కూడా వీటి ట్యాంకుల పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనవసరంగా నీరు వృధా కాకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎంపీడీవో సత్యం ప్రజలకు సూచనలు సలహాలు ఇచ్చారు.

# రైతన్నల సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం

### నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్ 3**

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నలు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని,రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. బుధవారం రైతన్న మీకోసం వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ, రైతన్న సేవలో కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుంది అనడానికి నిదర్శనం,ఈ రైతన్న మీకోసం వారోత్సవాలని వారం రోజుల పాటు జరిగిన ఈ



కార్యక్రమంలో ప్రతి రైతు ఇంటికి వెళ్లి రైతు యొక్క సమస్యల గురించి స్వయంగా తెలుసుకోవడం జరిగిందని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి 20వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని, 90 శాతం సబ్సిడీపై బిందు సేద్యం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుస్తున్నామని, సబ్సిడీపై మేలైన విత్తనాలు ఎరువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాలువల పూడికతీత, సకాలంలో నీటి విడుదల, వాన నీటి సంరక్షణ, నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందేలా మెరుగైన సాగునీటి విధానాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. ఎంఎస్పి ద్వారా రైతుల దగ్గర నుండి పంటను కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఎర్రగొండపాలెం సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ మాట్లాడుతూ ఈ గ్రామ సభలో ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో రబీ 2025 -26, ఖరీఫ్ 2026 -27, రబీ 2026- 27 యాక్షన్ ప్లాన్ తయారు చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గూడూరి ఎరిక్షన్ బాబు రైతులతో కలిసి ముఖ్యమంత్రి లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూరి సుబ్బారావు ,ఎర్రగొండపాలెం మండలం టిడిపి అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి,బోగోలు వెంకటసుబ్బారెడ్డి,వ్యవసాయాధికారి కే నీరజ , ఉద్యాన శాఖ అధికారి పి ఆది రెడ్డి , ఎర్రగొండపాలెం మండలం వివిధ స్థాయి కూటమి నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

మండలానికి 7 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులు మంజూరయ్యాయని ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి కోరారు చింతలపాలెం బోయ మడుగుల వెంగనగుంట లలో సెకండ్ గ్రేడ్ పోస్టులు మూడు హిందీ స్కూలు అసిస్టెంట్ పోస్టులు, సోషల్ ఒకటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ చేయనున్నామన్నారు శుక్రవారం లోగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు సెకండ్ గ్రేడ్ వారికి నెలకు పదివేల రూపాయలు, స్కూల్ అసిస్టెంట్లకు నెలకు 12 వేల 500 రూపాయలు గౌరవేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# మోటార్ సైకిల్ దొంగలు అరెస్ట్

## 11 బైకులు స్వాధీనం





**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 3**

మండలంలో వరుసగా జరుగుతున్న మోటార్‌సైకిల్ దొంగతనాలకు చెక్ పెడుతూ పుల్లలచెరువు పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టి ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. మొత్తం 11 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకోవడంతో కేసులకు సంబంధించి కీలక ముళ్లు విప్పబడ్డాయి.గత నెల 29న పుల్లలచెరువు బస్టాండ్‌లో నిలిపిన హీరో స్ప్లెండర్ (AP39EY3171) ను దొంగలు పారేశారు. ఫిర్యాదుపై Cr.No.86/2025 U/Sec 303(2) BNS కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఎల్.సంపత్ కుమార్ బృందం రహస్య సమాచారంతో దొంగల జాడను తేల్చింది. బుధ వారం ఉదయం 10.10 గంటలకు ముటుకుల శివారులోని సంతాన వేణుగోపాలస్వామి గుడి వద్ద దొంగలను పట్టుకున్నారు.అరెస్ట్ అయిన దొంగలు చొప్పరపు వేణు (20)చొప్పరపు సన్నీ (25) ఇద్దరూ గణేశ్‌పాలెం, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా – కూలీలు.వారి వద్ద నుండి TS05EU9988 నంబరు కలిగిన బజాజ్ పల్సర్ ను స్వాధీనం చేశారు.

**ఇంటివద్ద దాచిన 10 బైకులు బయటకు**

వేగవంతమైన దర్యాప్తుతో పల్నాడు జిల్లా గణేశ్‌పాలెం గ్రామంలోని వీరి ఇంటి వద్ద దాచిన మరో 10 దొంగిలించిన బైకులు బయటపడ్డాయి. ఇవి పుల్లలచెరువు, యర్రగొండపాలెం, దొనకొండ, మార్కాపురం రూరల్, పాతగుంటూరు, పిడుగురాళ్ల, నాగార్జునసాగర్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించినవే.

**స్వాధీనం చేసిన వాహనాలు**

హీరో స్ప్లెండర్ – AP39EY3171. హోండా షైన్ – AP39DV6907
హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ – AP39BA7398
బజాజ్ పల్సర్ – AP39HG9073
హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ – AP27BR5923
బజాజ్ పల్సర్ – AP39FU5212
హోండా షైన్ – AP07CQ8196
బజాజ్ పల్సర్ – AP39JX9798
హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ – AP07CJ9083
హీరో గ్లామర్ – (రిజిస్ట్రేషన్ అందుబాటులో లేదు)
బజాజ్ పల్సర్ – TS05EU9988
వాహనాల మొత్తం విలువ: రూ.10,00,000/–

**పోలీసులకు అభినందనలు..:** యర్రగొండపాలెం సీఐ కె.అజయ్ కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ సంపత్ కుమార్, హెచ్–806, పిసి రమేష్, అరుణ్ కుమార్, వీరాంజనేయులు, వేణు, కాశీ బాబు, %కస్త్ర% సత్యనారాయణ కేసును పట్టు దొరికేలా చేశారు.వారి సేవలను ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ నాగరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగులదినోత్సవం



**గిద్దలూరు పెన్ పవర్ డిశంబర్ 3**

స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగులప్రత్యేక పాఠశాలలోబుధవారం "అంతర్జాతీయ దివ్యాంగులదినోత్సవం" సందర్భంగా యువ ప్రగతి పథం సభ్యులు బదిరుల నడుమ కేక్ కటింగ్ చేయించివారికి పంచిపెట్టి తదుపరి పండ్లు బ్రెడ్స్ బిస్కెట్స్ బేకరి ఐటమ్స్ పంపిణీ చేశారు. ఈ సంస్థ అధ్యక్షులు ప్రభుత్వ ఉపాధ్యాయులు పగిడి వేణుగోపాల్ మాట్లాడుతూ వికలాంగులు వెలుగు దివ్వెలు అని అంగ వైకల్యంతో ఎన్నోఅవరోధాలను కష్టాలనుఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూమనం దరికీ స్ఫూర్తి నిస్తున్న దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ చేయత నివ్వాలని ప్రేమతో గౌరవి%ళి%చి అభిమానించివారికి బాసటగానిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గోపాల్ రెడ్డి ,యువ ప్రగతి సభ్యులు రత్నం పీరయ్య కిషోర్ నాయబ్ సిద్దయ్య సత్య సాయి సమితి సభ్యులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సీఎం ప్రసంగాన్ని లైవ్ లో వీక్షించిన చెరుకుపల్లి వెంకటరెడ్డి, శ్రీనివాస్ వర్మ



**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

మండలంలోని చింతపూడి రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని రైతులు,అధికారులు మరియు కదిరి బాబురావు వ్యవసాయ ఉద్యాన కళాశాల విద్యార్థులతో కలిసి మండల సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టిడిపి నాయకులు శ్రీనివాస వర్మ లైవ్ లో వీక్షించారు. కార్యక్రమంలో కదిరి బాబురావు వ్యవసాయ మరియు ఉద్యాన కళాశాల విద్యార్థులు రైతులతో అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన పథకాలు, రైతు సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు రంగాన్ని బలోపేతం చేయడంలో ప్రభుత్వ లక్ష్యాలను వివరించి ఇటువంటి కార్యక్రమాలు రైతులకు ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి పి మధుబాబు, గ్రామ ఉద్యాన సహాయకులు పి రమ్య మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రైతులకు శిక్షణ కార్యక్రమాలు

### ఏవో షేక్. మహమ్మద్



**పెన్ పవర్.కంభం డిసెంబర్ 3**

పంట కోతలు అనంతరం వ్యవసాయ ఉత్పత్తులపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.కంభం మండలం తురిమెళ్ళ లో మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ సుభద్ర అధ్యక్షతన జాతీయ ఆహార భద్రత మరియు పోషణ మిషన్ కింద పంట కోతల అనంతరం వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు అనే అంశంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమానికి దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.మానస హాజరై వివిధ పంటలలో కోతనంతరం తీసుకోవలసిన చర్యలు వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు ఎలా చేయాలో రైతులకు వివరించారు. కందులను నేరుగా మార్కెట్లో అమ్మేదానికంటే దానికి విలువ జోడించి పప్పుగా మార్చి కందిపప్పును మార్కెట్లో అమ్మితే దానికి విలువ అధికంగా ఉంటుంది, అలాగే ఎండుమిరపను కాయలుగా అమ్మే కంటే కారంగా మార్చి మార్కెట్లో అమ్మినట్లయితే అధికంగా ఆదాయం పొందే అవకాశం ఉంది, అలా చేయాలంటే రైతులు రైతు ఉత్పత్తి దారుల గ్రూపులుగా ఏర్పడి దానికి సంబంధించిన యంత్రాలను ఏర్పాటు చేసుకున్నట్లయితే రైతులకు లాభదాయకంగా ఉంటుంది అని తెలియజేశారు. వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ మాట్లాడుతూ శాస్త్రవేత్త తెలిపినట్లు రైతులందరూ తమ కుటుంబ అవసరాల మేరకు వ్యవసాయ ఉత్పత్తులను వాడుకొనగా మిగిలిన ఉత్పత్తులను, విలువలను జోడించి మార్కెట్ చేసుకున్నట్లయితే అధిక ఆదాయం పొందవచ్చుని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరమ్మ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సంక్రాంతి ఎడ్ల పోటీలకు ఎమ్మెల్యే స్థల పరిశీలన



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెంపెన్ పవర్ డిసెంబర్ 3**

తెలుగువారి పండుగ సంక్రాంతి పండుగ సందర్భంగా వైస్సార్సీపీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించేందుకు,బుధవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ స్థల పరిశీలన చేసారు.పుల్లలచెరువు రోడ్డులోని పార్కు వద్ద పోటీలు నిర్వహించాలని నియోజకవర్గ నాయకులతో చర్చించారు. అనంతరం మిల్లంపల్లి వేణుగోపాలస్వామి గుడివద్దబండ లాగుడు రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి మాట్లాడుతూ గత సంవత్సరం క్రీడ కారులను ప్రోత్సాహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించామని, 2026 సంక్రాంతికు రైతులను, పశు ప్రేమికులను ప్రాత్సహించేందుకు జాతీయ స్థాయిలో పోటీలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలొ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర పథకాలు అర్హులకు అందాలి

### నియోజకవర్గం ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ డిసెంబర్3**

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నా పథకాలు ప్రజలకు తెలియాలని,అధికారులు ఆ దిశగా కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు.బుధవారం పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో డిఆర్డిఎ,వెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సమీక్ష సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు డిపార్ట్మెంట్ పరిధిలో అందించే వడ్డీ లేని రుణాలను అందజేసి వారి అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రతి ఒక్కరికి రుణాలు అందేలా చూడాలని, కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందించేందుకు కృషి చేస్తుందని, అధికారులు కూడా చిత్త శుద్ధితో ప్రజలకు సేవా చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, స్వావాలంబన సాధించేందుకు డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా డి ఆర్డిఎ, పి డి,టీ నారాయణ, ఏ యం సి చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి,బోగోలు వెంకట సుబ్బారెడ్డి, మంత్రునాయక్ వెలుగు, డ్వాక్రా అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### రైతులకు భరోసా కల్పించిన అధికారులు

### కనీస మద్దతు ధరతో వరి కొనుగోలు –6 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు చెల్లింపు



**త్రిపురాంతకం పెన్ పవర్ డిసెంబర్ 03**

త్రిపురాంతకం మండలం ఎండూరివారి పాలెం గ్రామం లో రైతుసేవా కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రం ను ఓపెన్ చెయ్యటం జరిగింది, త్రిపురాంతకం మండలం లో దుపాడు –1,త్రిపురాంతకం, వెల్లంపల్లి, విశ్వనాధపురం, కంకణాలపల్లి, ఎండూరి వారిపాలెం, పాత అన్నసముద్రం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో వున్నాయి, గౌరవ జాయింట్ కలెక్టర్ ఆదేశాలు మేరకు ఈ రోజు ఎండూరివారి పాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ను ఓపెన్ చేయ్యటం జరిగింది వరి కనీస మద్దతు ధర గ్రేడ్ 'ఏ 'రకము క్వింట (100) 2389/–రూపాయలు, 75 కేజీల బస్తా 1792/– రూపాయలు మరియు గ్రేడ్ 'బి 'రకము క్వింట(100)2369/–రూపాయలు మరియు 75 కేజీల బస్తా 1777/– రూపాయలు కావున రైతులందరు ధాన్యం కొనుగోలు కేంద్రాలద్వార వరి ధాన్యం అమ్మోకోవాలని దళారీ చేతుల్లో మోసపోవద్దు అని కోరుతున్నాం ధాన్యం కొన్న 6 గంటలకే రైతు అకౌంట్ నగదు డబ్బులు జమ చెయ్యటం జరుగుతుంది ఈ కార్యక్రమం లో ఆర్డీవో మార్కాపురం వెంకట శివ రామక్రిష్ణ రెడ్డి చెప్పటం జరిగింది, ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం తాసిల్దార్ క్రిష్ణ మోహన్ , మండల అగ్రికల్చర్ ఆఫీసర్ బి. సంగమేశ్వర రెడ్డి , మండలం టీడీపీ పార్టీఅధ్యక్షులు మేకల వలరాజు యాదవ్ మరియు పిఎసిఎస్ సభ్యులు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## మెగా పిటియంకి సిద్ధం కావాలి



**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

మండలంలోని అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మెగా పిటియం కార్యక్రమం శుక్రవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు జె ప్రసాద్ రావు, రాజాల కొండారెడ్డి సూచించారు బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు పంపించడం ప్రోగ్రెస్ కార్డులు నమోదు అసెస్ మెంట్ పుస్తకాల మూల్యాంకనం మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు వంటి అన్ని అంశాలలో సంసిద్ధులుగా ఉండాలని కోరారు ఎఫ్ఎల్ఎన్ సర్వే వెంటనే పూర్తి చేసి ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు ఎఫ్ఎల్ఎన్ అమలు పదో తరగతి విద్యార్థుల కోసం వందరోజుల ప్రణాళిక తప్పకుండా అన్ని పాఠశాలల్లో ఆచరించాలన్నారు సమావేశంలో ఎంఈఓ లు జె ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో శ్రీవారి దర్శనానికి భక్తులకు అనుమతి

### – శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 03**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం (ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. ఆలయంతో పాటు గర్భ గుడిని బాహ్య పరిసరాలను వస్తు సామాగ్రిని పాత్రలను దేవతామూర్తులను శుభ్రం చేశారు, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి... ధర్మ కర్తల మండలి ప్రతినిధులు పర్యవేక్షించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి భక్తులను యధావిధిగా శ్రీవారి దర్శనానికి అనుమతించడం జరుగుతుందని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు.



## విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

### ఎంఈఓ రాజాల కొండారెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సి ఎస్ పురం ఎస్టి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పోటీలు కార్యక్రమాలు నిర్వహించారు భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు విద్యాబోధనతో పాటు అనేక రకాలు ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నామన్నారు. భవిత కేంద్రానికి రాలేని వారికి శనివారం రోజు ఇంటి వద్దే విద్య ఫిజియోథెరపీ వంటి సేవలు అందుతున్నాయన్నారు. మంచి భవిష్యత్తు కోసం దివ్యాంగులకు భవిత కేంద్రాలు వరం వంటివి అన్నారు. ప్రభుత్వం తాజాగా ఆటీజం కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని దేశంలో మరే రాష్ట్రం లో కూడా ఆటీజం కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు భోజనం ప్లేట్లు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మన్నేపల్లి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు ఆంటోనీ, ఇండ్ల శ్రీను,కేతనబోయిన




పెద్దన్న, భవిత సెంటర్ టీచర్ వేల్పుల వెంకట్రావు ప్రతిభావంతుల తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చెరుకుపల్లి వెంకటరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం రైతు సేవా కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో బుధవారం మండల సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న వ్యవసాయ అనుకూల చర్యలను వివరించారు. వరి ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొలతలు, బిల్లుల సాకారం–ప్రతీ అంశాన్ని పారదర్శకంగా నిర్వహించనున్నట్లు భరోసా ఇచ్చారు.రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు సమస్యలు లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి తిరుపతిరెడ్డి, వ్యవసాయ సహాయకులు, సహకార సంఘం ప్రతినిధి శ్రీను స్థానిక రైతులు పాల్గొన్నారు.



# రోడ్డు నిర్మాణానికి దామచర్ల ఆదేశం

### - నష్ట పోయే వారికి టి డి ఆర్ బాండ్ల రూపంలో లబ్ధికి చర్యలు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ డిసెంబర్ 03**

ఆక్రమణలన్నీ తొలిగించి ప్రజలు నడవటానికి ఇబ్బంది లేకుండా 6 అడుగుల మేర రోడ్డును ఒక్క నెలలో పూర్తి చేసి ప్రజలకు నడక మార్గం కల్పించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక 21వ డివిజన్ ఎన్జీవో హో హోమ్ ప్రాంత ప్రజలు తమ నివాస ప్రాంతాలకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రోడ్డు ఏర్పాటు సందర్భంగా నివాసితులు ఎవరైనా నష్టపోతే వారికి టీడీఆర్ బాండ్ల రూపంలో లబ్ధి చేకూర్చాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరావు, డివిజన్ అధ్యక్షులు బాబురావు, కాశీరావు, పొన్నారసు మురళి, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలికొండ విషయంలో ఎటువంటి రాద్దాంతం చేయవద్దు

### ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**పొదిలి, పెన్ పవర్, డిసెంబర్ 3**

పొదిలి కొండ విషయంలో ఎటువంటి రాద్దాంతం అవసరం లేదని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. బుధవారం నాడు ఆయన పొదిలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. పొదిలి కొండపైన వెలసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మర్రిపూడి లో విలీనం చేశారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారే తప్ప, ఇందులో ఏమాత్రం నిజం లేదని ఎమ్మెల్యే కందుల కొట్టి పారేశారు. మృదుల గిరి పరిరక్షణ సమితి పేరుతో కొందరు అనవసరమైన సమస్యలు సృష్టిస్తున్నారని కొందరు సృష్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. పృదులగిరి పరిరక్షణ సమితి పేరుతో ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే కందుల చెప్పారు. పొదిలికొండ పరిస్థితి మామూలుగానే ఉందని, ఈ విషయంలో ఎవ్వరు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే కందుల చెప్పారు. బాధ్యత గల శాసనసభ్యులుగా రాబోయే కాలంలో తన నియోజకవర్గంలో 5000 మందికి ఉద్యోగాలు ఇప్పించడంతోపాటు, 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఎమ్మెల్యే కందుల భరోసా ఇచ్చారు. ఇటీవల కురిసిన తుఫాన్ భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు కనీసం పరామర్శించని వారు కోటి సంతకాల పేరుతో బజార్లలో తిరగడం ఎంత మాత్రం సమంజసం అని ఎమ్మెల్యే కందుల ప్రశ్నించారు. మార్కాపురం ను జిల్లాగా మార్చడం తమ ప్రభుత్వ గొప్పతనంగా ఎమ్మెల్యే కందుల చెప్పుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఎందుకు ఈ విధంగా కృషి చేయలేదని ఎమ్మెల్యే కందుల సూటిగా ప్రశ్నించారు. పొదిలి చెరువుల విషయంలో వైకాపా నాయకులు ఏమి చేశారో చెప్పాలని ఎమ్మెల్యే కందుల నిలదీశారు. వైకాపా ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పిన విధానాన్ని గమనించుకొని ఆ పార్టీ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకొని, ప్రజా సమస్యల గురించి పట్టించుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హితువు పలికారు.

# జి జి హెచ్‌లో పారిశుధ్య లోపాలను వారంలోగా సరిదిద్దాలి

### - శానిటేషన్ ఏజన్సీ వారికి డి ఆర్ ఓ ఓబులేసు ఆదేశం



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ డిసెంబర్ 03**

జి జి హెచ్ లో పారిశుద్ధ్యం లో లోపాలను వారం లోపు పూర్తి స్థాయి లో సరిదిద్దాలని, ఎం ఓ యూ ప్రకారం అన్ని రకాల సదుపాయాలు సమకూర్చుకోవాలని డి ఆర్వో ఓబులేసు శానిటేషన్ ఏజెన్సీ వారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జి జి హెచ్ లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల పై కమిటీ సభ్యులు డి ఆర్వో, జి జి హెచ్ సూపరెంటెండెట్ జిల్లా వైద్య అధికారి, మునిసిపల్, ఏపీఎంసీడీసీ , అధికారులతో కూడిన కమిటీ జి జి హెచ్ సూపరెంటెండెంట్ ఛాంబర్ లో సమావేశం అయ్యారు. ఈ నెల 24 న తొలిసారి కమిటీ జి జి హెచ్ లో పరిశీలన చేసింది. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఏజెన్సీ ప్రతినిధుల నుంచి ఎం ఓ యూ ప్రకారం సమకూర్చుకున్న పరికరాలు, మానవ వనరుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. కొంత మేరకు మాత్రమే పరికరాలు, ఇతర సదుపాయాలు సమకూర్చుకున్నామని కొద్ది రోజుల్లో పూర్తి స్థాయి లో సామాగ్రి అందుబాటులోకి వస్తుందని అధికారులకు వివరించారు. 15 ఏళ్లగా డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేసారని వాటి పూర్తి స్థాయి మరమ్మతులకు సమయం పడుతుందని ఏజెన్సీ సిబ్బంది తెలిపారు. మరో వారంలో కమిటీ సమావేశం అవుతుందని ఆ లోపు కమిటీ సూచించిన మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశం జి జి హెచ్ సూపరింటెండెంట్ డా. మాణిక్య రావు,జిల్లా వైద్య శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు,అడిషనల్ డైరెక్టర్ జి జి హెచ్ అనిల్ కుమార్ రెడ్డి, ఏపీఎంసీడీసీ ఇంజనీరింగ్ అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్, సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డా.మాధవీ లత, తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో ఉప్పొంగిన కృతజ్ఞతా భావం

### :కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడాన్ని హర్షిస్తూ భారీర్యాలీ
### :చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్, లోకేష్ ఫోటోలకు పాలాభిషేకం
### :తరలివచ్చిన అన్ని వర్గాల ప్రజలు
### :కందుకూరుకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తా
### :ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు పెన్ పవర్, డిసెంబర్ 3:**

కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు తమ అభిమానాన్ని ఉప్పొంగిపోయేలా చాటుకున్నారు. తమ ఆకాంక్షను నెరవేర్చారంటూ స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి జేజేలు పలికారు. కాలేజీ యువత మొదలుకొని వృద్ధుల వరకు స్వచ్ఛందంగా తరలివచ్చి కందుకూరు పట్టణంలో బుధవారం గొప్ప ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, డాక్టర్లు, లాయర్లు ఇలా అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముందుగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని పామూరు రోడ్డు జంక్షన్ నుంచి ర్యాలీ మొదలు కాగా, ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళు లర్పించారు. అక్కడి నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే సహా పలువురు నేతలు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత జేఏసీ, ప్రజాసంఘాల నేతలు కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యువత హుషారుగా డాన్సులు వేస్తూ, ఎమ్మెల్యే కి జై కొడుతూ ర్యాలీలో పాల్గొని సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం దుర్మార్గమైన నిర్ణయం కారణంగా కందుకూరు నియోజకవర్గం నెల్లూరులో కలిసిందని, మూడేళ్లుగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల, 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఆ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయం తీసుకుంటే, వారి ఆగ్రహం ఏ స్థాయిలో ఉంటుందో కందుకూరులో అందరూ చూశారని అన్నారు. ప్రజలంతా ఏకమై రోడ్లమీదకు వచ్చి 55 రోజుల పాటు దీక్షలు, ధర్నాలు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా అనిపించలేదన్నారు.కందుకూరు ప్రజల ఇబ్బందులను గమనించి, గత ఎన్నికలకు ముందు ఒంగోలులో జరిగిన మహానాడులో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తీర్మానం ప్రవేశపెట్టిన సంగతిని ఎమ్మెల్యే నాగేశ్వరావు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే కందుకూరుకు న్యాయం చేస్తానని చంద్రబాబు అనాడే చెప్పారని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రకు వచ్చిన సందర్భంలో, వలేటివారిపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతూ, కందుకూరుకు న్యాయం చేస్తానని చెప్పిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ , ఇతర పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. గతంలో 24 మండలాలతో కందుకూరు డివిజన్ విస్తరించి ఉండేదని, కందుకూరు వైభవాన్ని నాశనం చేశారని జగన్మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వ కార్యాలయాలు కందుకూరు నుంచి తరలి వెళ్లాయని, దీనివల్ల ప్రజల ఇబ్బందులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, ఆ కార్యాలయాలన్నీ కందుకూరుకు తిరిగి వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. మొత్తంగా కందుకూరుకు పూర్వ వైభవం తీసుకురావడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తానన్నారు. చంద్రబాబు నాయుడు సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో ఈ ఏడాదిన్నర కాలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.బీజేపీ నేత మురళి, జనసేన నేత శిగా తిరుపాలు, లాయర్ బెజవాడ క్రిష్ణయ్య, జేఏసీ నేత బి వెంకటేశ్వర్లు, ఉద్యోగుల తరపున ఆర్ వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే నాగేశ్వరరావు కి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు మల్లేశ్వరరావు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, రాష్ట్ర విద్యాశాఖ ఇన్ ఫాస్ట్ ట్రక్చర్ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, అల్లం వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, రావూరి రామకోటయ్య, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, కల్లూరి శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీనివాసరావు, పొడపాటి మహేష్ గొంది నరసింగ రావు, ముచ్చు వేణు, పసుపులేటి రమణయ్య, జేఏసీ సభ్యులు, అన్ని గ్రామ పార్టీ నాయకులు, కూటమి నేతలు, మహిళలు, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు సురక్షిత త్రాగు నీటిని అందించడం లక్ష్యం -మేయర్ గంగాడ సుజాత




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు డిసెంబర్ 03**

నగర ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగు నీరుని అందిచే విధంగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు సూచనల మేరకు తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం ఇంజనీరింగ్ సిబ్బందితో నిర్వహిస్తున్నట్లు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు బుధవారం స్థానిక మంచినీటి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఉన్న శుభ్రపరిచే కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జనం జీవనాధారం జలం కాబట్టి ప్రతి ఒక్కరూ మంచినీటిని వృధా చేయకుండా వాడుకోవాలని, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ మాసం ను జల సురక్ష మాసం గా ప్రకటించి ఉన్నందున ఒంగోలు నగరం లో గల 22 ఎలెవేటెడ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్ (ఈ ఎల్ ఎస్ ఆర్) లను శుభ్రపరిచి నగర ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది తో ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. బుధవారం నగరం లోని 6 ఈ ఎల్ ఎస్ ఆర్ లను క్లీన్ చేయటం జరుగుతోందని కమిషనర్ తెలిపారు. ఇందులో భాగంగా రాంనగర్ 9వ లో గల ఈ ఎల్ ఎస్ ఆర్ క్లీన్ చేసే పనిని స్థానిక 15 వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపి తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఇసయ్య,ఏఈ అనీల్, 15 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు ఆదినారాయణ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం - జిల్లా కలెక్టర్ రాజాబాబు

**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ డిసెంబర్ 03**

జిల్లాలో విభిన్న ప్రతిభా వంతులను ప్రోత్స హించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైనఅన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆయన చెప్పారు.జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో విభిన్న ప్రతిభావంతు లకు ప్రభుత్వం నిబంధనల మేరకు ఉద్యోగ అవకాశాలు పదోన్నతులు కల్పిస్తా మని ఆయన చెప్పారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతు ల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆయన చెప్పారు. విభిన్న ప్రతిభావంతు లకు నెలకు 6వేల రూపాయలు పెన్షన్లు ప్రభుత్వం అందిస్తుందని ఆయన చెప్పారు. జిల్లాలో విభిన్న ప్రతిభా వంతుల కోసం సమగ్ర సంక్షేమ హాస్టల్ ను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక లు తయారు చేయాల నిఅధికారులను ఆదేశించామని ఆయన చెప్పారు. విభిన్న ప్రతిభా వంతులు ఆత్మస్థైర్యం తో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. విభిన్న ప్రతిభా వంతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించ డానికి కలెక్టరేట్ లో ఒక లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే వివిధ రకాల పనుల కోసం వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకమైన మరుగు దొడ్లు నిర్మిస్తామని ఆయన చెప్పారు. విభిన్న ప్రతిభా వంతుల కోసం స్వచ్ఛంద సంస్థలు బాగాపని చేస్తున్నాయని ఆయన చెప్పారు.ఈ సందర్భంగా విభిన్న ప్రతిభా వంతుల స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి వారి ఆర్థిక అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థతో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డైరెక్టర్ ఎం.ఓ.యు కుదుర్చుకున్నారు. అనంతరం విభిన్న ప్రతిభా వంతులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్, గంగాడ సుజాత, జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, లోక్ ఆదాలత్ జడ్జి ఎస్.కె ఇబ్రహీం షరీఫ్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారి సువార్త, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ వెంకటే శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల రాబడిని పెంచేందుకు చర్యలు - జిల్లా కలెక్టర్ రాజాబాబు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ డిసెంబర్ 03**

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. రైతన్నా - మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మద్దిపాడు మండలం దొడ్డవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట ఉత్పత్తులకు అవసరమైన గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు సాగులో నూతన పరిజ్ఞానాన్ని రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వినూత్న విధానాలతో రాబడి పెంచుకునేలా రైతులు కూడా ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఆయా విషయాలపై అవగాహన కల్పించేందుకే ఇలాంటి ప్రత్యేక వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగులో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. భూమి రకం, వాతావరణ పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు వారు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రైతులు, వ్యవసాయ అధికారులు సమిష్టిగా పనిచేస్తేనే ఈ రంగం మరింత అభివృద్ధి వైపు సాగుతుందని కలెక్టర్ చెప్పారు. అందుకే స్థానిక వనరులను సమర్థంగా రైతులు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, తహసిల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ముందుగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని వీరంతా వీక్షించారు.

# సీఎం ప్రసంగాన్ని లైవ్ లో వీక్షించిన కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ డిసెంబర్ 3**

'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించిన లైవ్ ను కదిరి బాబురావు అగ్రికల్చర్ హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు పాల్గొని వీక్షించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వీరన్న గౌడ్, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల మంజూరు...



**పుల్లల చెరువు పెన్ పవర్ డిసెంబర్ 3**

పుల్లలచెరువు మండలానికి 2025-26 విద్యా సంవత్సరానికి ఐదు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు, మూడు ఎస్ జీటీలు, మూడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు అయినట్లు మండల విద్యాధికారి ఎం.వి. భాస్కర్ తెలిపారు. అర్హతగల అభ్యర్థులు డిసెంబర్ 5 సాయంత్రం 5 గంటల లోపు మండల విద్యా వనరుల కేంద్రంలో తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. గడువు తరువాత వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

**ఎస్ జిటి లు మంజూరైన పాఠశాలలు**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గాజులపాలెం
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎం. ఎర్రబాలెం
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సుద్ధ కురువతాండ
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నరజాముల తాండ
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడికిటివారిపల్లి
స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (మొత్తం 3)
ZPHS మర్రివేముల – ఫిజికల్ సైన్స్
ZPHS ముటుకుల – ఫిజికల్ సైన్స్
ZPHS ముటుకుల – హిందీ

**అర్హతలు..:** డీఎడ్ మరియు బిఈడ్ అర్హత కలిగిన విద్యావంతులు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.దరఖాస్తులు సమర్పణలో అభ్యర్థులు గడువును తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# స్థానిక కల్చర్ కనిపించేలా రైల్వే స్టేషన్ నిర్మాణాలు

**ఏలూరు, డిసెంబర్ 3 పెన్ పవర్:** ఏలూరు రైల్వే స్టేషన్. పూర్తిగా ట్రెడిషనల్ లుక్ లో ఏలూరు కి దగ్గర్లోని ద్వారకా తిరుమల ఆలయ గోపురాన్ని తలపించేలా రైల్వే స్టేషన్ ను నిర్మిస్తున్నారు. "అమృత్ భారత్ స్టేషన్ " స్కీమ్ క్రింద దేశం లోని చాలా రైల్వే స్టేషన్ లను డెవలప్ చేస్తోంది కేంద్రం. ఒకప్పుడు రైల్వే స్టేషన్ అంటే గుర్తు వచ్చే పాడుబడిన భవనాలు, అపరిశుభ్రం గా ఉండే పరిసరాల స్థానం లో కోట్లు ఖర్చు పెట్టి పూర్తిగా న్యూ లుక్ ఇస్తుంది రైల్వే శాఖ. ఇప్పటికే కొన్ని స్టేషన్ లు రెడీ అయ్యాయి. మరికొన్ని స్టేషన్ ల ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.అయితే ఈ నిర్మాణాల సమయం లో లోకల్ కల్చర్ కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆమధ్య పూర్తిగా డెవలప్ చేసిన సూళ్లూరు పేట రైల్వే స్టేషన్ కు దగ్గర్లోని చెంగాలమ్మ గుడి ని తలపించే ఎలివేషన్ ఇచ్చారు. ఇప్పుడు ఏలూరు స్టేషన్ కు ద్వారకా తిరుమల టెంపుల్ లుక్ ఇస్తున్నారు.ద్వారకా తిరుమల (చిన తిరుపతి ) కి వెళ్లాలంటే ఏలూరు స్టేషన్ లోనే దిగాలిఏలూరు కి దగ్గర్లోనే ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చిన్న తిరుపతి (ద్వారకా తిరుమల ) కి వెళ్లాలంటే ఎక్స్ ప్రెస్ ట్రైన్స్ ఆగేది ఏలూరు స్టేషన్ లోనే. 20 కిమీ దూరం లో ఉన్న భీమడోలు స్టేషన్ లో అన్ని రైళ్ళూ ఆగవు. అందుకే ద్వారకా తిరుమల వెళ్లే భక్తులకు ఏలూరు స్టేషన్ లో దిగడమే బెస్ట్ అప్షన్ గా ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఏలూరు రైల్వే స్టేషన్ కు ఆ డివోషనల్ టచ్ ఇస్తున్నారు. ఇది పూర్తి అయితే ఏలూరుకు ఒక ఐకానిక్ బిల్డింగ్ గా మారుతుంది అంటున్నారు అక్కడి ప్రజలు.ఈ మధ్యనే ఏలూరు స్టేషన్ లో అమృత్ సంవాద్ పేరిట స్థానికుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంది సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారుల బృందం. ఆ సందర్భంగా రైళ్లకి కొన్ని అదనపు కోచ్ లను ఏర్పాటు చెయ్యాలని.. స్టేషన్ లో కొన్ని అదనపు సౌకర్యాలు పెంచాలని ప్రయాణికులు కోరారు.

# కొడాలి నానిపై ఉపేక్ష ఎందుకు



**విజయవాడ, డిసెంబర్ 3, పెన్ పవర్:** :వైసీపీ హయాంలో కొడాలి నాని వాయిస్ బలంగా వినిపించేది. అయితే అదేదో ఆయన నిర్వర్తించిన శాఖకు సంబంధించినది కాదు. ఈ రాష్ట్ర సమస్యలపై అంతకంటే కాదు. నందమూరి కుటుంబం పేరు చెప్పుకుంటూ నారా కుటుంబాన్ని టార్గెట్ చేయడం నానికి అలవాటైన విద్యగా మారిపోయింది. నాడు టిడిపి ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభిస్తే.. కొడాలి నాని మాత్రం నందమూరి కుటుంబానికి నారా కుటుంబం అన్యాయం చేసిందని.. ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని చెబుతూ చివరకు.. జూనియర్ ఎన్టీఆర్కు అన్యాయం చేశారని ముగించేవారు కొడాలి నాని. అటువంటి కొడాలి నాని పై సగటు టిడిపి అభిమాని ఆగ్రహంగా ఉండేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే కొడాలి నాని అరెస్టు ఉంటుందని భావించారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. చంద్రబాబు కుటుంబమే టార్గెట్.. కొడాలి నాని నోటికి చంద్రబాబు కుటుంబమంతా బలి అయ్యేది. వాడు వీడు అంటూ చంద్రబాబు పై ప్రయోగించే భాష చెవులకు ఇబ్బందిగా ఉండేది. లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారు. హద్దులు దాటి మాట్లాడేవారు. సగటు టిడిపి అభిమాని అయితే కొడాలి నాని పై ప్రతీకార వాంఛతో రగిలిపోయేవారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మానవత్వం మరిచి చేసిన వ్యాఖ్యలను విన్నవారి రక్తం మరిగిపోయేది. అంతలా ఆ కుటుంబాన్ని టార్గెట్ చేసిన కొడాలి నాని తప్పకుండా మూల్యం చెల్లించుకోవాలని సగటు టిడిపి అభిమాని బలంగా కోరుకునేవారు. జగన్ కళ్ళలో ఆనందం కోసం కొడాలి నాని ఆ వ్యాఖ్యలు చేసేవారు. అయితే ఆనందం మాట పక్కన ఉంచితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర వైఫల్యానికి, ఫలితాలకు కూడా కొడాలి నాని వంటి వారు ప్రధాన కారణం. గుడివాడ కొడాలి నాని అడ్డా.. దమ్ముంటే రండిరా అంటూ జగన్ ప్రోత్సాహంతో రెచ్చిపోయేవారు కొడాలి నాని. విపరీతమైన విజయగర్వంతో, అహంకారపూరిత మాటలతో ఐదేళ్లపాటు టిడిపి శ్రేణులను చుక్కలు చూపించారు. పద్ధతి లేని మాటలతో, బూతు వ్యాఖ్యలతో జగన్మోహన్ రెడ్డిని ఆకట్టుకున్నారు. టిడిపి శ్రేణులకు వ్యతిరేకంగా మారిపోయారు. 18 నెలల కిందట అధికారంలోకి వచ్చిన టిడిపి శ్రేణులు నాని అరెస్టును కోరుకున్నాయి కానీ అది జరగలేదు. వంశీని అరెస్టు చేసి.. వల్లభనేని వంశీ మోహన్ కు మించి కొడాలి నాని మాట్లాడేవారు. అయితే వంశీ మోహన్ ను అరెస్టు చేసి ఉంచినప్పుడు ఆయనపై సానుభూతి లభించలేదు. ఎందుకంటే ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకున్నారు కూడా. అయితే ఇప్పటికీ కొడాలి నాని మాటలు విని.. చేతలు చూసిన టిడిపి శ్రేణులు కొడాలి నాని అరెస్టు ఎప్పుడు అని ఎదురు చూస్తున్నాయి. ఆయన విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నట్టు అని అనుమానం ఒకటి కలుగుతోంది. అయితే గుడివాడ జంక్షన్ లో కొట్టుకొని తీసుకెళ్దాం అంటూ రెడ్ బుక్కును గుర్తుపెట్టుకొని మాట్లాడారు లోకేష్. కానీ అటువంటిదేమీ కనిపించకపోవడంతో కొడాలి నాని క్షమించేసారని నాయకత్వం పై టిడిపి శ్రేణులు అనుమానిస్తున్నాయి.

# నెల్లూరులో లేడీ డాన్ లు

**నెల్లూరు, డిసెంబర్ 3,పెన్ పవర్:**
నెల్లూరు అంటే చాలా ప్రశాంతతకు మారు పేరు. చెన్నైకి సమీపంలో ఉండటంతో ఎక్కువ సంబంధాలు తమిళనాడుతోనే ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ బంగారు వ్యాపారానికి పుట్టినిల్లు అని చెప్పాలి. అయితే గత రెండేళ్ల నుంచి నెల్లూరు హత్యలకు నిలయంగా మారింది. పెన్నా నదీతీరంలో ఉన్న సింహపురి వరి ధాన్యానికి ఫేమస్. అలాగే సినిమాలకు కూడా ప్రసిద్ధి. అలాంటి నెల్లూరు నేడు నేరాలకు నిలయంగా మారింది. నార్కొటిక్స్ హబ్‌గా నెల్లూరు మారింది. హత్యలు, దోపిడిలు, గంజాయి సంస్కృతి ఇటీవల కాలంలో మరింత పెరిగింది. అసలు రౌడీషీటర్లు, లేడీ డాన్లు ఇంత మంది నెల్లూరులో ఉన్నారా? అన్న నిజం సింహపురి వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.కొందరు రౌడీషీటర్లు జైళ్ల నుంచే గంజాయి, రౌడీయిజం ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఒడిషా నుంచి షిప్‌లో ఏపీకి గంజాయి సరఫరా అవుతుంది. అక్కడి నుంచి బైక్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులో రవాణా సాగుతుంది. మూడు అంచెల్లో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే 30 మంది సప్లయర్స్ ఉన్నారని పోలీసులు గుర్ంచారు. 300 మంది డెలివరీ బాయ్స్ నెట్‌వర్క్ తో యథేచ్ఛగా నెల్లూరులో గంజాయి విక్రయాలు జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీపీఎం నేత పెంచలయ్య హత్యకు 300 రూపాయల గంజాయి ప్యాకెట్ కారణం అని అంటున్నారు. పీకలు కోసే సంప్రదాయానికి కూడా నెల్లూరు రౌడీషీటర్లు తెగిస్తున్నారు.ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో కూడా నెల్లూరు క్రిమినల్స్ సుపారీ తీసుకుని మరీ చేశారని పోలీసులే చెబుతున్నారు. నెల్లూరు ఒకప్పుడు నిజాయితీ, నమ్మకం, ప్రేమకు పేరుపొందిన నగరం. అయితే ఈరోజు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డ్రగ్స్, రౌడీయిజం నెల్లూరులో జైలు నుంచే నడుస్తున్నాయి. నెల్లూరు నేరగాళ్లకు నిలయంగా మారింది. లేడీ డాన్ లు అరుణ, అరవ కామాక్షిలు నెల్లూరు నగరాన్ని శాసిస్తున్నారు. అసలు నెల్లూరులో ఇంత మంది రౌడీషీటర్లున్నా లేడీ డాన్ లు మాత్రం చక్రం తిప్పుతున్నారంటే నెల్లూరు వాసులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మాఫియా సామ్రాజ్యానికి రాణులుగా చెలామణి అవుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా నెల్లూరు మాఫియా గ్యాంగ్ పై ఉక్కుపాదం మోపి మునుపటి నెల్లూరులా మార్చాలని నగర వాసులు కోరుకుంటున్నారు.

# క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు



**అమరావతి, డిసెంబర్ 3, పెన్ పవర్:**
రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలను కేటాయించారు. అందులో రెండు ఎకరాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్(ఎక్యూసిసి) ఏర్పాటు చేయనున్నారు. ఇది జాతీయ సాంకేతిక భవిష్యత్ కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాయపూడి పరిధిలోని సీఆర్‌ఏ ప్రధాన కార్యాలయానికి ఉత్తరభాగంలో సీడ్ యాక్సెస్రోడ్డు అవతల దీనిని నిర్మించనున్నారు. క్వాంటం బిల్డింగ్ నిర్మాణం కోసం ఆసక్తి ఉన్న వారిని టెండర్ల కోసం పిలిచారు. ఈ నెల ఆరోతేదీతో టెండర్ల గడువు ముగియనుంది. ప్రాజెక్టు వ్యాల్యూను స్పష్టంగా పేర్కొనకపోయినా నిర్దేశిత ధరకంటే ఎవరు తక్కువకు టెండర్ వేస్తే వారికి కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందించారు.ప్రస్తుతం విట్ యూనివర్శిటీలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్ లో రాయపూడి వద్ద నిర్మించే శాశ్వత భవనంలోకి దీన్ని మార్చనున్నారు. అనంతరం అమరావతిని పూర్తిస్థాయి క్వాంటం సిటీగా మార్చాలనేది ప్రభుత్వ ఆలోచన. భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును సీఆర్ డిఏ ఐటీ అండ్ ఈ శాఖ సంయుక్తంగా ఖర్చు చేయనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు. ప్రస్తుత భవనాన్ని %+% ప్లస్1 అంతస్తుగా 4,201 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మెకానికల్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్, ఫైర్(ఎంఈపిఎఫ్)తో గ్రీన్ బిల్డింగ్ నిబంధనల ప్రకారం నిర్మించనున్నారు. దీనిలో గ్రౌండ్ ఫ్లోర్ 1,990 చదరపు మీటర్లు, మొదటి ఫ్లోర్ 1,996 చదరపు మీటర్లు, బేస్ మెంట్ 210 చదరపు మీటర్లతో నిర్మించున్నారు. ఇవి కాకుండా హెడ్ రూము 109, డెక్ ఏరియా 130 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.భవిష్యత్తులో జాతీయస్థాయి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్గా మార్చాలనేనది ప్రతిపాదనగా ఉంది. దీనికోసం ఇటీవల క్వాంటం వర్కుషాపు కూడా నిర్వహించారు. టిసిఎస్, ఐబిఎంతోపాటు దేశంలో పలు ఐటి కంపెనీల ప్రతినిధులనూ దీనికి ఆహ్వానించారు. ఇందులో భాగంగా ఐబిఎం 150 క్యూబిట్ కెపాసిటీతో కంప్యూటర్ ఏర్పాటు వేసేందుకు ముందుకు వచ్చింది. టిసీఎస్ అవసరమైన సాంకేతిక నైపుణాన్ని ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ నిర్మాణపరమైన అంశాల్లో భాగస్వామ్యం కానుంది. ఇలా మూడు కంపెనీలతో ఇటీవల ప్రభుత్వం ఒప్పందం. చేసుకోవడంతోపాటు క్వాంటం పాలసీని విడుదల చేసింది. వీటిలో భాగంగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచింది కూటమి ప్రభుత్వం.ఏపీలో క్వాంటం కంప్యూటింగ్ పై అవగాహన పెంచేందుకు 50,000 మందికి శిక్షణ ఇవ్వబోతోంది ప్రభుత్వం. అమెరికా లోని వైజర్, హైదరాబాద్ లోని క్యూబైటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ కలిసి ఈ శిక్షణ ఇవ్వబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 8 నుండి ఈ ట్రైనింగ్ ప్రారంభం కానుంది.ఈ ట్రైనింగ్ మూడు పార్టు లుగా ఉంటుంది. ఫేజ్ 1 ట్రైనింగ్ 4 వారాలు ఉంటుంది. ఏపీ విద్యార్థులకు ఫీజ్ 500. మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్, కంప్యూటర్ కోర్సులు చదువుతున్న వారు, ఆల్రెడీ చదువు పూర్తి చేసుకున్న వారు, ఆయా సబ్జెక్టు ల్లో ప్రొఫెసర్ లుగా పనిచేస్తున్న వారు ఈ కోర్స్ కోసం అప్లై చేసుకోవచ్చు. వేరే రాష్ట్రాలకు చెందిన విద్యార్థులయితే 1000 రూపాయలు, ఆల్రెడీ టీచర్స్ గా జాబ్ చేస్తున్న వారు 2000 రూపాయలు ఫీజ్ చెల్లించాల్సి ఉంటుంది. ఫేజ్ 1 లో మంచి మార్కులు తెచ్చుకున్న 3000 మందిని ఎంపిక చేసి వారికి రెండో ఫేజ్ లో శిక్షణ ఇస్తారు. ఈ ట్రైనింగ్ మొత్తం ఆన్ లైన్ లోనే ఉంటుంది.

# మామిడికాయ స్థానంలో అరటిపండు...



**అనంతపురం, డిసెంబర్ 3, పెన్ పవర్:**
ఏపీలో అరటి రైతుల సమస్యలపై అధికార, విపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ఏపీలో కిలో అరటి 50 పైసలు మాత్రమే పలుకుతోందంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోమవారం విమర్శలు గుప్పించారు. ఈ విషయంపై ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అయితే వైఎస్ జగన్ ట్వీట్ మీద ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం స్పందించింది. వైఎస్ జగన్ అబద్ధాలు చెప్తున్నారని ఆరోపించింది. డిసెంబర్ రెండో వారం నుంచి అరటి ధరలు పెరుగుతాయని.. రైతులు అపోహలను నమ్మవద్దని సూచించింది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడు ఏ విషయం చర్చనీయాంశమవుతుందో చెప్పడం.. చాలా కష్టం. చిన్న అవకాశం దొరికినా అధికార పార్టీని ఇరుకున పెట్టాలని విపక్షం.. విపక్షానికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఎదురు దాడి చేయాలని అధికార పక్షం.. ఎప్పటికప్పుడు కొత్త లెక్కలు, ఎత్తులకు పైఎత్తులు వేస్తూ.. రాజకీయ చదరంగాన్ని రసవత్తరంగా మారుస్తుంటాయి . అయితే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అరటి కాయ లేదా అరటి పండు.. చాలా హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయం మీద విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. అధికార కూటమి వాగ్బాణాలు, విమర్శలు, ప్రతివిమర్శలు సంధించుకుంటున్నాయి.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల సొంత జిల్లాలో పర్యటించారు. పులివెందుల వెళ్లిన వైఎస్ జగన్ అక్కడ అరటి తోటలను పరిశీలించారు. అరటి ధర పతనం గురించి రైతులతో చర్చించారు. తమ హయాంలో అరటికి మంచి గిట్టుబాటు ధర ఉండేదన్న వైఎస్ జగన్.. కూటమి పాలనలో అరటికే కాదు.. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో డిమాండ్ లేకపోతే ఇతర రాష్ట్రాలకు రైళ్లల్లో రవాణా చేయించిన ఘనత తమ పార్టీ సొంతమని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటి సీఎం చంద్రబాబు అరటి రైతులను అసలు పట్టించుకోవడమే లేదని మండిపడ్డారు.ఇక సోమవారం రోజున అరటి రైతుల సమస్యపై ఓ ట్వీట్ చేశారు వైఎస్ జగన్..భారతదేశ ప్రజలరా.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వైపు చూడండి.. ఇక్కడ ఒక కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలు మాత్రమే! ఆంధ్రప్రదేశ్‌లో అరటి రైతులు పడుతున్న కష్టాలు ఇవి. అగ్గిపెట్టెకన్నా, బిస్కెట్ కన్నా చవకగా ఇక్కడ అరటి పండ్లు దొరుకుతున్నాయి. అరటి మాత్రమే కాదు ఉల్లి నుంచి టమోటాల వరకూ.. ఇలా ఏ పంటకూ ఏపీలో గిట్టుబాటు ధర లేదంటూ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ట్వీట్ చేశారు. రైతులు కష్టాలలో ఉంటే ఉచిత పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు. పెట్టుబడి సాయం వంటివేవీ లేవని విమర్శించారు. తమ పాలనలో టన్ను అరటి రూ.25000 ఉండేదన్న జగన్.. ఇప్పుడా పరిస్థితి లేదంటూ విమర్శలు చేశారు.అయితే ఏపీలో కిలో అరటి పండ్లు కేవలం 50 పైసలు మాత్రమేనంటూ వైఎస్ జగన్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం స్పందించింది. కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలకు మాత్రమే అంటూ వైఎస్ జగన్ చెప్పడం పూర్తిగా సత్యదూరమని ఏపీ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తెలిపింది. అక్టోబర్ నెలలో ఈ సీజన్ ప్రారంభం కాగానే అరటి టన్ను రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకూ అమ్ముడైందని.. నవంబరు నెల మొదటి వారంలో ఏ గ్రేడు అరటి పండ్లు రూ.7 వేలు, బీ గ్రేడ్ రూ.4 వేలు, సీ గ్రేడ్ రూ.3వేలకు అమ్ముడైనట్లు తెలిపింది. నవంబర్ నెల నాలుగో వారంలో ఏ గ్రేడు అరటి పండ్లు టన్ను రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెరిగాయని.. బీ గ్రేడు రూ.6 వేల నుంచి రూ 8 వేలకు, సీ గ్రేడు రూ. 4 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్ముడైనట్లు తెలిపింది.అనంతపురం, సత్యసాయి , కడప, నంద్యాల జిల్లాల్లో 34,000 హెక్టార్లలో అరటి పంట సాగవుతోందని తెలిపింది. కడప, అనంతపురం జిల్లాల నుంచి 700 మెట్రిక్ టన్నుల అరటిని ఉత్తర భారతదేశానికి తరలించి.. అక్కడ విక్రయించినట్లు తెలిపింది. గత వారం రోజులుగా అరటి మెట్రిక్ టన్నుకు రూ 2 వేల నుంచి రూ.4 వేలు పెరిగిందని.. అరటి రైతులకు రవాణా రాయితీ ఇవ్వాల్సిందిగా భారతీయ రైల్వేను కూడా కోరామని వెల్లడించింది. డిసెంబర్ రెండో వారం నుంచి అరటి ధర మరింత పెరిగే అవకాశం ఉందన్న ఏపీ ప్రభుత్వం.. రైతులను నిరాశకు గురిచేసేలా ప్రకటనలు చేయడం సరికాదని సూచించింది.

# ఏపీలో బుల్లెట్ రైళ్లు.. కర్నూలులో శంకుస్థాపన అడుగులు

**కర్నూలు, డిసెంబర్ 3, పెన్ పవర్:**
దేశవ్యాప్తంగా బుల్లెట్ రైళ్ల నెట్‌వర్క్‌ను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఆగస్టులో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లకు ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్- బెంగళూరు కారిడార్‌కు సంబంధించి ఏపీలో ఉన్న 263 కిలోమీటర్ల మార్గంలో పలు చోట్ల మట్టి నమూనాలు సేకరించే పనులు ప్రారంభమైనట్లు సమాచారం. ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే గంటకు 320 కిలోమీటర్ల వేగంతో కర్నూలు నుంచి బెంగళూరుకు కేవలం గంట 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.దేశంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టి మార్పులకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా ప్రపంచంతో పోటీ పడేలా బుల్లెట్ రైళ్లు తీసుకొస్తోంది. ఇప్పటికే ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో బుల్లెట్ రైళ్ల నెట్‌వర్క్ మరింత విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్- బెంగళూరు కారిడార్లను ప్రకటించింది. ఈ రెండు బుల్లెట్ రైలు ప్రాజెక్టులకు దాదాపు రూ. 5.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఈ క్రమంలో హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కు సంబంధించి ప్రాథమిక సర్వే పనులు ప్రారంభమయ్యాయి.హైదరాబాద్- బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్ మొత్తం పొడవు 605 కిలోమీటర్లు. ఇందులో 263 కిలోమీటర్ల మార్గం ఆంధ్రప్రదేశ్‌లో ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా ఈ మార్గం ఉంది. ఈ కారిడార్‌కు సంబంధించి ప్రాథమిక సర్వే పనులు ప్రారంభమయ్యాయి. బుల్లెట్ రైళ్లు పరుగెత్తడానికి అనువైన ట్రాక్ నిర్మాణం కోసం.. ఏపీలో పలు చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే పూర్తయ్యాక తదుపరి ప్రక్రియ కొనసాగుతుంది. బుల్లెట్ రైలు గరిష్ఠ వేగం గంటకు 350 కిలోమీటర్లు. భద్రతా కారణాల రీత్యా 320 కిలోమీటర్ల వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.నిర్దేశించిన వేగంతో బుల్లెట్ రైలు దూసుకెళ్లాలంటే.. ట్రాక్ పటిష్ఠంగా ఉండాలి. అందుకోసం సాయిల్ టెస్టింగ్ (మట్టి పరీక్షలు) చేస్తారు. ట్రాక్ నిర్మించే ప్రదేశంలో జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు చేస్తారు. డ్రిల్లింగ్ చేసి మట్టి, బండరాళ్ల నమూనాలు సేకరిస్తారు. అనంతరం ఆ మట్టి ఏ రకానికి చెందింది, అందులో తేమ ఎంత మేర ఉంది, స్వెల్ ప్రెషర్ ఎంత ఉందని విశ్లేషిస్తారు. బుల్లెట్ రైలు ట్రాక్ నిర్మాణంలో మట్టి పరీక్షల వివరాలు కీలకం. ఏయే ప్రాంతాల్లో ఎలివేటెడ్ మార్గాలు, సొరంగాలు, నిర్మించాలో దీన్ని బట్టే నిర్ణయిస్తారు.ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి కర్నూలు వాసులు బెంగళూరుకు మరింత వేగంగా వెళ్లొచ్చు. కర్నూలు- బెంగళూరు మధ్య దూరం 427 కిలోమీటర్లు ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాలంటే.. 5.30 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు.. గంట 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.

# రాయ్‌పూర్‌లో పరుగుల వరద..

## శతక్కొట్టిన కోహ్లీ, రుతురాజ్.. దక్షిణాఫ్రికాకు భారీ లక్ష్యం

దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో సెంచరీల మోత

రికార్డు స్థాయిలో 53వ శతకం బాదిన విరాట్ కోహ్లీ

తొలి వన్డే సెంచరీ నమోదు చేసిన రుతురాజ్ గైక్వాడ్

చివర్లో మెరుపులు మెరిపించిన కెప్టెన్ కేఎల్ రాహుల్

దక్షిణాఫ్రికా ముందు 359 పరుగుల భారీ లక్ష్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా బ్యాటర్లు పరుగుల వరద పారించారు. విరాట్ కోహ్లీ (102) తన రికార్డును మరింత మెరుగుపరుచుకుంటూ 53వ వన్డే సెంచరీ సాధించగా, యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ (105) తన కెరీర్‌లో తొలి వన్డే శతకాన్ని నమోదు చేశాడు. వీరిద్దరి అద్భుత ప్రదర్శనకు కేఎల్ రాహుల్ మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోరు సాధించింది.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులో నిలిచిన విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా

ఎదుర్కొంటూ మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.శతకాలు పూర్తి చేసుకున్న తర్వాత వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో కేఎల్ రాహుల్ దూకుడును ప్రదర్శించాడు. కేవలం 43 బంతుల్లోనే 66 పరుగులు చేసి అజేయంగా నిలవడంతో భారత స్కోరు 350 మార్కును దాటింది. సఫారీ బౌలర్లలో మార్కో యన్సెన్ 2 వికెట్లు పడగొట్టగా... ఎంగిడి, బర్గర్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్ గెలవాలంటే దక్షిణాఫ్రికా 359 పరుగులు చేయాలి. మూడు వన్డేల సిరీస్‌లో ఇప్పటికే భారత్ మొదటి వన్డేలో గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

# కోహ్లీ, రోహిత్ 2027 వరల్డ్‌కప్‌లో ఆడకపోతే సంతోషిస్తా: రహ్మానుల్లా గుర్బాజ్

వారిద్దరూ లేకపోతే ప్రత్యర్థులకు గెలిచే అవకాశాలు మెరుగవుతాయన్న గుర్బాజ్

ఫామ్ కోల్పోయినప్పుడు విరాట్ కోహ్లీ సలహాలు తీసుకుంటానని వెల్లడి

ఇటీవల కోహ్లీ సలహాతోనే మరుసటి మ్యాచ్‌లో 90 పరుగులు చేశానన్న ఆఫ్ఘన్ వికెట్ కీపర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడకపోతేనే బాగుంటుందని ఆఫ్ఘనిస్థాన్ వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ సరదాగా వ్యాఖ్యానించాడు. వారిద్దరూ జట్టులో లేకపోతే ప్రత్యర్థి జట్లకు గెలిచే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, అందుకే ఓ ఆఫ్ఘన్ ఆటగాడిగా తాను సంతోషిస్తానని అన్నాడు. కోహ్లీ, రోహిత్‌లను లెజెండ్స్‌గా అభివర్ణించిన గుర్బాజ్, వారిద్దరూ లేకుండా జట్టును ఊహించడం కష్టమని పేర్కొన్నాడు.ఐఎల్‌టీ20 టోర్నీ ప్రారంభానికి ముందు 'ఇండియా టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడిన గుర్బాజ్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ సందర్భంగా విరాట్, కోహ్లీతో తనకున్న అనుబంధాన్ని బయటపెట్టాడు. "నేను ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నప్పుడు లేదా ఏదైనా సలహా కావాలనుకున్నప్పుడు విరాట్ భాయ్‌కు ఫోన్ చేస్తాను. ఇటీవల నేను సరిగా పరుగులు చేయలేక ఇబ్బంది పడ్డాను. అప్పుడు ఆయనకు ఫోన్ చేసి మాట్లాడాను. ఆయన సలహా తీసుకున్న మరుసటి మ్యాచ్‌లోనే నేను 90కి పైగా పరుగులు చేశాను" అని వెల్లడించాడు.కోహ్లీ ఇచ్చే సలహా చాలా సింపుల్‌గా ఉంటుందని గుర్బాజ్ తెలిపాడు. "ఆటను ఎక్కువగా సంక్లిష్టం చేసుకోవద్దు, కష్టపడి ఆడుతూ ఆస్వాదించు అని ఆయన చెబుతారు. గత మూడేళ్లుగా నాకు ఎప్పుడు అవసరమైనా ఆయన అందుబాటులో ఉంటూ సహాయం చేస్తున్నారు" అని కోహ్లీపై ప్రశంసలు కురిపించాడు.

# హర్షిత్ రానా ఓవరాక్షన్‌కు ఐసీసీ సీరియస్ వార్నింగ్.. క్రమశిక్షణ తప్పినందుకు డీమెరిట్ పాయింట్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రానా క్రమశిక్షణ తప్పాడు. తొలి వన్డేలో భాగంగా ఈ పేసర్ బ్రేవీస్ వికెట్ తీసిన తర్వాత చేసిన మితిమీరిన సెలెబ్రేషన్ ఇందుకు కారణం. భారీ లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సఫారీ చిచ్చర పిడుగు డేవాల్డ్ బ్రేవీస్ తనదైన శైలిలో కొన్ని బౌండరీలు కొట్టి ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లాడు. ఇన్నింగ్స్ 22 ఓవర్లో హర్షిత్ రానా బౌలింగ్ లో బ్రేవీస్ ఔటయ్యాడు. బౌండరీ దగ్గర గైక్వాడ్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. దీంతో రానా అత్యుత్సాహంతో బ్రేవీస్ ను చూస్తూ డ్రెస్సింగ్ రూమ్ వైపు వెళ్ళు అన్నట్టు హద్దులు మీరు సెలబ్రేషన్ చేసుకున్నాడు.

"రాంచీలో జరిగిన తొలి వన్డేలో సౌతాఫ్రికాపై విజయం సాధించిన తర్వాత భారత పేసర్ హర్షిత్ రాణా మందలింపు అందుకున్నాడు. హర్షిత్ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.5ని ఉల్లంఘించినట్లు తేలింది. 'అంతర్జాతీయ మ్యాచ్ సమయంలో బ్యాట్స్‌మన్ అవుట్ అయినప్పుడు అతనిని అవమానించేలా లేదా దూకుడుగా స్పందించినా.. లేకపోతే సైగలు చేసినా పనిష్ మెంట్ ఉంటుంది. హర్షిత్ ప్రొటీస్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను ఔట్ చేసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్ వైపు సైగ చేసినట్లు తేలింది. దీంతో తన క్రమశిక్షణ ఉల్లంఘించాడని ఒక డీమెరిట్ పాయింట్ ఇవ్వాల్సి వచ్చింది". అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. . హర్షిత్ రానా హద్దులు దాటి సెలెబ్రేషన్ చేసుకోవడం ఇదే తొలిసారి కాదు. ఐపీఎల్ 2024 సీజన్ లో రానా కేకేఆర్ తరపున ఆడుతూ సన్ రైజర్స్ బ్యాటర్ మయాంక్ అగర్వాల్ ను ఔట్ చేసి ఫ్లైయింగ్ కిస్ ఇస్తూ పెవిలియన్ కు వెళ్ళు అని ఓవరాక్షన్ చేశాడు. ఇదిలా ఉంటే.. సౌతాఫ్రికాతో ఇటీవలే జరిగిన తొలి వన్డేలో హర్షిత్ అద్భుతంగా రాణించాడు. 10 ఓవర్ల స్పెల్ లో 65 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు తీసుకున్నాడు. ఒకే ఓవర్లో డికాక్, రికెల్ టన్ లను డకౌట్ చేశాడు. అంతేకాదు కీలక సమయంలో బ్రేవీస్ వికెట్ పడగొట్టి టీమిండియాకు బిగ్ రిలీఫ్ ఇచ్చాడు. ప్రస్తుతం సౌతాఫ్రికాతో టీమిండియా రెండో వన్డే ఆడుతోంది. ఈ మ్యాచ్ లో హర్షిత్ ప్లేయింగ్ 11 లో చోటు సంపాదించాడు.

# దురంధర్.. గాలి తీసేస్తున్న బాక్సాఫీస్

ఫాతిమా సనా షేక్ తన కొత్త ఫోటోషూట్‌లో సొగసును ప్రసరిస్తుంది



గత కొన్నేళ్లుగా సౌత్ సినిమాల ధాటికి బాలీవుడ్ అస్సలు తట్టుకోలేకపోతోంది. 'బాహుబలి' ప్రభంజనం తర్వాత మరెన్నో సౌత్ సినిమాలు నార్త్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాయి. కేజీఎఫ్, కేజీఎఫ్-2, ఆర్ఆర్ఆర్, 'పుష్ప', 'పుష్ప-2', కాంతార, కాంతార-2, మహావతార నరసింహ.. ఇలా ఎన్నో సినిమాలకు ఉత్తరాది ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదే సమయంలో బాలీవుడ్ టాప్ స్టార్లు నటించిన అనేక చిత్రాలు దారుణమైన ఫలితాలందుకున్నాయి. అక్కడి స్టార్లకు ఓపెనింగ్ రావడం కూడా కష్టమవుతోంది.బాలీవుడ్లో భారీ వసూళ్లు సాధించిన చిత్రాల్లో 'యానిమల్', 'జవాన్' సౌత్ డైరెక్టర్లు తీసిన సినిమాలు కావడం గమనార్హం. ఇలాంటి టైంలో 'దురంధర్' అనే సినిమా మీద బాలీవుడ్ చాలా ఆశలు పెట్టుకుంది. 'యురి' దర్శకుడు ఆదిత్య ధర్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రమిది. రణ్వీర్ సింగ్ హీరోగా నటించాడు. సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా.. ఇలా పేరున్న తారాగణమే ఉంది ఇందులో.



'దురంధర్'ను రణ్వీర్ సింగ్‌కు 'యానిమల్' లాంటి సినిమా అంటూ బాలీవుడ్ తెగ హైప్ ఇచ్చుకుంది. దీని ట్రైలర్ 'యానిమల్' సినిమా ప్రోమోలను గుర్తు చేసింది. 'యానిమల్'ను అనుకరిస్తూ ఈ చిత్రానికి మూడున్నర గంటలకు పైగా రన్ టైం కూడా ఫిక్స్ చేశారు. ఈ సినిమాతో బాక్సాఫీస్ షేక్ అయిపోతుందని.. ఈ ఏడాది హైయెస్ట్ గ్రాసర్‌గా ఈ మూవీ నిలవబోతోందని ట్రేడ్ పండిట్లతో సోషల్ మీడియా పోస్టులు వేయించుకున్నారు. తీరా రిలీజ్ టైం దగ్గరికొచ్చేసరికి 'దురంధర్' తుస్సుమనిపిస్తోంది.

దీనికి రెండు రోజుల ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా.. స్పందన అంతంతమాత్రంగా ఉంది. ఫాస్ట్ ఫిల్లింగ్ షోలు చాల్నా తక్కువగా కనిపిస్తున్నాయి. సినిమా కోసం జనం ఎగబడే పరిస్థితి కనిపించడం లేదు. 'యానిమల్' రిలీజైనపుడు టికెట్ల కోసం డిమాండ్ మామూలుగా లేదు. అదనపు షోలు యాడ్ చేస్తూ వెళ్లారు. మిడ్ నైట్ షోలు కూడా వేశారు. ఆ చిత్రానికి భారీ ఓపెనింగ్స్ కూడా వచ్చాయి. కానీ 'దురంధర్' మీద ఇంతకుముందున్న 40-50 కోట్ల ఓపెనింగ్ అంచనాలను ఎంతమాత్రం అందుకునే పరిస్థితి కనిపించడం లేదు. తొలి రోజు రూ.20 కోట్లు వస్తే గొప్ప అన్నట్లుంది పరిస్థితి. సినిమాకు టాక్ పాజిటివ్‌గా రాకపోతే.. రూ.350 కోట్ల బడ్జెట్ పెట్టిన ఆదిత్య ధర్ అండ్ కో నిలువునా మునిగిపోవడం ఖాయం.

జాన్వీ కపూర్ ఎప్పుడూ స్పాట్‌లైట్‌లో ఉండే అందాల భామ



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com